# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 206 | హైదరాబాద్ | శుక్రవారం 06-02-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

డబ్ల్యూపీఎల్ ఫైనల్... ఆర్సీబీకి భారీ టార్గెట్ ఇచ్చిన ఢిల్లీ క్యాపిటల్స్




11లో

## తెలంగాణ డీజీపీ నియామకంపై

### సుప్రీంకోర్టు సీరియస్..

### 4 వారాల్లో తేల్చాల్సిందే

- ఇన్‌చార్జ్ పాలన చెల్లదు
- 4 వారాల్లో తెలంగాణ డీజీపీ నియామకం తేల్చండి: సుప్రీంకోర్టు ఆదేశం

### హన్మకొండలో మేడారం

## హుండీల లెక్కింపు



11లో

- కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ
- టీటీడీ కల్యాణ మండపంలో హుండీల లెక్కింపు
- లెక్కింపునకు పది రోజుల సమయం పట్టే అవకాశం

### కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను

# అరెస్టు చేయాలి

**బీజేపీకి రేవంత్ రెడ్డి డిమాండ్**

11లో



- బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధమన్న ముఖ్యమంత్రి
- ఏపీలో అధికారం కోల్పోతామని తెలిసినా సోనియా తెలంగాణ ఇచ్చారని వ్యాఖ్య
- అసెంబ్లీకి రాని కేసీఆర్‌కు వేతనం కట్ చేయవద్దా అని ప్రశ్న



## ముంబయిలో లిఫ్ట్‌లో గ్యాస్ బెలూన్లు పేలి మంటలు..

- ముంబయిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఘటన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- బెలూన్ షాపు యజమానిపై కేసు నమోదు చేసిన పోలీసులు

11లో

### నిరసనల మధ్య... రాజ్యసభలో

# ప్రధాని మోదీ ప్రసంగం



11లో

- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని ప్రసంగం
- మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తకంపై చర్చకు పట్టుబట్టిన విపక్షాలు
- ప్రధాని మాట్లాడుతుండగా నినాదాలు.. సభ నుంచి వాకౌట్ చేసిన విపక్ష సభ్యులు
- వికసిత భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోందన్న ప్రధాని మోదీ
- భారత్‌తో వ్యాపారానికి ప్రపంచ దేశాలు ఆసక్తి చూపుతున్నాయని వ్యాఖ్య

### బొగ్గు గనిలో పేలుడు..

## 16 మంది మృత్యువాత

- మేఘాలయలోని బొగ్గు గనిలో భారీ పేలుడు
- ఘటనలో 16 మంది కార్మికులు మృతి
- మృతుల్లో ఎక్కువ మంది అసోం వాసులుగా అనుమానం
- ఘటనా స్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు



11లో

### వైసీపీ హయాంలో చేసిన పనులకు

# బిల్లులు మేమే చెల్లిస్తాం: సీఎం

- ప్రతి ఎకరాకు నీరందించడమే లక్ష్యమని స్పష్టం చేసిన సీఎం చంద్రబాబు
- సాగునీటి సంఘాలు చేపట్టే పనులకు జీఎస్టీ ఉండదని కీలక హామీ
- వైసీపీ ప్రభుత్వంలో పెండింగులో ఉన్న బిల్లులు కూడా చెల్లిస్తామని భరోసా
- పరుగెత్తే నీటిని నిలిపి భూగర్భ జలాలు పెంచాలని సంఘాలకు సూచన
- ప్రత్యామ్నాయ పంటలతో రైతుల ఆదాయం పెంచేలా చర్యలు తీసుకుంటామని వెల్లడి

11లో





11లో

### పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో

# భారత్ 'వాయు' గర్జన

- పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో వాయుసేన భారీ విన్యాసాలు
- ఫిబ్రవరి 27న జైసల్మేర్‌లో 'వాయు శక్తి 2026' పేరిట ప్రదర్శన
- 'ఆపరేషన్ సిందూర్' తరహాలో సాగనున్న ఎక్సర్‌సైజ్
- రఫేల్, సుఖోయ్, తేజస్, మిగ్29 యుద్ధ విమానాలతో ప్రదర్శన
- తొలిసారిగా మిగ్21 లేకుండా జరగనున్న వైమానిక విన్యాసాలు




భారత శక్తి

# నరవాణె రణం...

భారత పార్లమెంటులో ఫిబ్రవరి 2న రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాల చర్చ జరిగింది. ఇందులో విపక్ష నేత రాహుల్ గాంధీ అసలు అంశంపై మాట్లాడకుండా మాజీ ఆర్మీ చీఫ్ నరవాణె ఆత్మకథలోని అంశాలు ప్రస్తావించారు. 2020 గల్వాన్ ఘటన సమయంలో చైనా దూసుకువచ్చినప్పుడు ప్రభుత్వం ధైర్యం చేయలేదని, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భయపడ్డారని పేర్కొన్నారు. అయితే ఈ పుస్తకం ఇంకా ప్రచురితం కాలేదు. రక్షణ శాఖలో పనిచేసిన అధికారులు రాసే పుస్తకాలు ప్రచురణకు ముందు రక్షణ మంత్రిత్వ శాఖ అనుమతి తప్పనిసరి. ఈ పుస్తకానికి అనుమతి ఇవ్వలేదు. కొన్ని అంశాలు మాత్రమే పత్రికల్లో ప్రచురితమయ్యాయి. పార్లమెంటు నియమాల ప్రకారం నిరాధార అంశాలు, పుస్తకాలు, పత్రికా కథనాలు ఆధారంగా మాట్లాడకూడదు. నరవాణె వాస్తవానికి ప్రభుత్వం సరైన చర్యలే తీసుకుందని పేర్కొన్నారు. ఆసియాలో భారత్?చైనా సంబంధాలు మెరుగుపడితే అమెరికాకు ఇబ్బంది. రాహుల్ ప్రసంగం దీన్ని ఆపే ప్రయత్నంగా కనిపిస్తోంది. అమెరికా సందర్శనల్లో చైనా విషయాలు ప్రస్తావించడం, వాణిజ్య ఒప్పందాల హడావుడి ఈ భావనకు బలం చేకూరుస్తున్నాయి. పార్లమెంటు వేదికను ఉపయోగించి దౌత్య సంబంధాలను దెబ్బతీయాలనే ఉద్దేశం ఉందా అన్న చర్చ ఊపందుకుంది. చైనాతో సరిహద్దు సమస్య విషయంలో మోదీ సర్కారు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించిందని భారత మాజీ సైన్యాధిపతి ఎంఎం నరవణెతెలిపారు. నిర్ణయాలన్నీ కేంద్రీకృతంగా ఉండేవని చెప్పారు. అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లోనూ యుద్ధం వైపు మొగ్గు చూపలేదని వెల్లడించారు. సరిహద్దుల్లో తలెత్తిన ఉద్రిక్తతలను రాజకీయ ఆదేశాలు లేకుండా సైన్యమే సొంత నిర్ణయాలతో పరిష్కరించుకోవాలన్నట్లుగా ప్రభుత్వ విధానం ఉండేదన్నారు. సైన్యం కూడా చైనా దురాక్రమణలను సమర్థంగా నిలువరించిందని, అయితే, చాలా వివాదాలు పరిష్కారం కాకుండానే మిగిలిపోయాయని చెప్పారు. చైనాతో సరిహద్దు పరిణామాల మీద దేశ ప్రజలకు పూర్తి అవగాహన కలిగించకుండా ప్రభుత్వం పరిమితులు విధించిందని అభిప్రాయపడ్డారు. చైనా విషయంలో కీలక నిర్ణయాలు తీసుకోవాల్సిన పరిస్థితి వచ్చినపుడు రాజకీయ నాయకత్వం సైనికపరంగా కానీ, దౌత్యపరంగా కానీ మార్గదర్శనం చేయలేదని చెప్పారు. 2020 ఆగస్టు 31న చైనా ట్యాంకులు భారత భూభాగంలోకి ప్రవేశించినపుడు కూడా ఏది మంచిదైతే అదే చేయండంటూ నిర్ణయాన్ని తమకే వదిలేశారన్నారు. మొత్తం మీద చైనాను నిలువరించామే కానీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించలేదని చెప్పారు. నిర్ణయాలు తీసుకొని అమలు చేయాల్సిన బాధ్యతతో పాటు జవాబుదారీతనాన్ని కూడా సైన్యం మీదే పెట్టారని తెలిపారు. అయితే, “మోదీ క్రమశిక్షణ కలిగిన వ్యక్తి. ఫోర్సె?సను చాలా గౌరవంగా చూసేవారు. ఏం చెప్పినా శ్రద్ధగా వినేవారు” అని నరవణే పేర్కొన్నారు. 2019 డిసెంబరు 31 నుంచి 2022 ఏప్రిల్ 30 వరకు భారత సైన్యాధిపతిగా పనిచేసిన నరవణే జనరల్‌గా తన ప్రయాణాన్ని “ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ” పేరుతో పుస్తకం రాశారు. ఆ పుస్తకాన్ని ప్రచురించేందుకు భారత ప్రభుత్వం అనుమతించలేదు. ఈ నేపథ్యంలో ఆయన పుస్తకంలోని అంశాలను ప్రస్తావిస్తూ కారవాన్ మ్యాగజీన్ 40 పేజీల సుదీర్ఘ వ్యాసాన్ని ప్రచురించింది. చైనా విధానాన్ని రాజకీయ నాయకత్వం కేంద్రీకృతం చేసింది. ప్రధాని కార్యాలయం, భద్రతా సలహాదారు కార్యాలయం చేతుల్లో ఉంటుంది. సైన్యం పదేపదే స్పష్టత కోరాల్సిన పరిస్థితి. నిజానికి ఒకడుగు ముందుకు వేస్తే యుద్ధం అనే పరిస్థితి ఉంటుంది. కానీ, ఏం చేయాలో చెప్పరు. 2020 ఆగస్టు 31 పరిస్థితే ఇందుకు ఉదాహరణ. తూర్పు లద్ధాఖ్‌లోని రెచిన్ లా వద్ద నాలుగు చైనా ట్యాంకులు భారత భూభాగంలోకి ప్రవేశించాయి. అప్పటికే అదే లద్ధాఖ్‌లోని గల్వాన్ లోయలో రెండున్నర నెలల ముందు చైనా చొరబాట్లను నియంత్రించే క్రమంలో తెలంగాణకు చెందిన కర్నల్ సంతో?షబాబు సహా 20 మంది భారతీయ సైనికులు వీరమరణం పొందారు. అలాంటి పరిస్థితుల్లో రెచిన్‌లా వద్ద భారత ఫార్వార్డ్ పొజిషన్ల వద్దకు చైనా ట్యాంకులు వచ్చేశాయి. ఎదురుదాడి చేయాలా? నియంత్రణ పాటించాలా? ‘వాట్ ఆర్ మై ఆర్డర్స్’ అని రాజకీయ నాయకత్వాన్ని అడిగాం. ఏది సరైన నిర్ణయమని భావిస్తారో అదే చేయండి అంటూ ప్రధాని నుంచి కింది వారి ద్వారా ఆదేశాలు వచ్చాయి. ఎదురు దాడికి దిగితే యుద్ధంలోకి వెళ్లే అవకాశాలే ఎక్కువ. అది సైన్యం మాత్రమే తీసుకోవాల్సిన నిర్ణయం కాదు. దాంతో మళ్లీ అడిగాం. నిర్ణయం ప్రకటించేందుకు రాజకీయ నాయకత్వం సిద్ధం లేదని సందేశం వచ్చింది. యుద్ధాలను సంబంధించిన నిర్ణయాలను సైన్యానికి వదిలేయకూడదు. దౌత్యం, ఆర్థిక వ్యవస్థ, అంతర్జాతీయ పొత్తులను ప్రభావితం చేసే అంశాల్లో సైన్యాధిపతి నిర్ణయం తీసుకోలేడు. అయితే, నియంత్రణ పాటిస్తూ సైన్యాన్ని మోహరించాం. చివరకు చైనా సైన్యం సంప్రదింపులకు వచ్చింది. లద్ధాఖ్‌లో 2020లో చైనా పథకం ప్రకారం ఆక్రమణలకు పాల్పడింది. గల్వాన్‌లోనే కాదు. పలుచోట్ల ఆక్రమణలు జరిగాయి. కొన్ని భారత్ ఆలస్యంగా గ్రహించింది. ఒత్తిడిలో స్పందించాల్సిన పరిస్థితి. సరిహద్దు వెంట పలుచోట్ల ఇరు సైన్యాలు తలపడాల్సి వచ్చింది. గల్వాన్ ఒక్కటే కాదు. చర్చల ద్వారా కొన్నిచోట్ల వెనక్కి తగ్గారు కొన్నిచోట్ల బఫర్ జోన్లు ఏర్పాటు చేశారు. కొన్నిచోట్ల పెట్రోలింగ్ మీద నియంత్రణలు పాటించాలని నిర్ణయించారు. అయినా కొన్ని చోట్ల పరిష్కారం కాలేదు. గల్వాన్ దాడి పథకం ప్రకారం జరిగింది. చైనా సైన్యం భారత సైనికులను బంధించి కొట్టింది. భారత్ తీవ్రంగా ప్రతిఘటించి చైనాకు తీవ్ర నష్టం చేయడంతో హఠాత్తుగా స్టేటస్ కో నాటకం ఆడింది.

# రాజ్యసభకు చిరంజీవి...?

విజయవాడ, ఫిబ్రవరి 05: భారత శక్తి

ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కూటమి 20 నెలల పాలన పూర్తి చేసుకుంది. ప్రజల్లో ఒక రకమైన సంతృప్తి కనిపిస్తోంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో దూకుడుగా వ్యవహరిస్తోంది. అయితే టిడిపి శ్రేణులు గట్టిగానే ఢీకొడుతున్నాయి. వారితో పోల్చుకుంటే జనసేన నేతలు స్పందించడం లేదు. దీనిపైనే చర్చ నడుస్తుండగా పార్టీ శ్రేణులకు గట్టి సంకేతాలు పంపారు పవన్ కళ్యాణ్. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గట్టిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఇటువంటి పరిస్థితుల్లో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. వారిద్దరి మధ్య కీలక రాజకీయ చర్చలు జరిగాయి. లడ్డూ వివాదం నేపథ్యంలో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయంలో అనుసరించాల్సిన అంశాలపై వారిద్దరి మధ్య చర్చ సాగింది. సహజంగానే ఇద్దరు నేతల ఏకాంత భేటీ అంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గురించి అయి ఉంటుంది. మరోవైపు ఇటీవల పవన్ ఢిల్లీ వెళ్లి వచ్చారు. దీంతో ఇద్దరి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. తిరుమల లడ్డూ తయారీకి సంబంధించి వాడిన నెయ్యిలో వైసిపి హయాంలో జంతు కొవ్వు కలిసిందన్నది ప్రధాన ఆరోపణ. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం గత కొద్ది నెలలుగా విచారణ చేపట్టింది. ఇటీవల కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. మరోవైపు సిబిఐ ల్యాబ్ నిర్ధారణ అంటూ ఒక విషయం బయటపడింది. ఆ నెయ్యిలో జంతు కొవ్వు కలపలేదన్నది ఒక వాదన. వాడినది మాత్రం ఆవు పాలతో తయారు చేసిన నెయ్యి కాదని.. కొన్ని రసాయనాల మిశ్రమాలతో తయారు చేసింది అంటూ మరో వాదన. ఈ విషయంలో అధికార విపక్షాల మధ్య గట్టి ఫైట్ నడుస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు వెలిసాయి. దానికి వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాప ప్రక్షాళన యాత్ర చేపట్టింది. అందులో భాగంగా మాజీమంత్రి అంబటి రాంబాబును టిడిపి శ్రేణులు అడ్డగించాయి. ఈ క్రమంలో ఆయన సీఎం చంద్రబాబుపై బూతు వ్యాఖ్యలు చేశారు. ఆయన అరెస్టు జరిగింది. ఈరోజు అంబటి కుటుంబ సభ్యులను జగన్మోహన్ రెడ్డి పరామర్శించారు. అయితే ఈ ఎపిసోడ్ నేపథ్యంలో సీఎం



చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఇటీవల ఢిల్లీ వెళ్లి వచ్చారు పవన్ కళ్యాణ్. కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులపై చర్చించారు. అయితే హోం శాఖ మంత్రి అమిత్ షాను కలవడం మాత్రం కొత్త చర్చకు దారితీసింది. రాజ్యసభ పదవి కోసమే పవన్ ఢిల్లీ వెళ్లారని ప్రచారం జరిగింది. ఈ ఏడాది జూన్లో ఏపీ నుంచి నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వాని.. టిడిపికి చెందిన సానా సతీష్ పదవీ విరమణ చేయనున్నారు. గతంలో నాలుగు రాజ్యసభ పదవులకు గాను.. బిజెపి, టిడిపి రెండు పదవులు చొప్పున తీసుకున్నాయి. జనసేనకు రాజ్యసభలో ఇంతవరకు ప్రాతినిధ్యం లేదు. అందుకే ఈసారి తమకు చాన్స్ ఇవ్వాలని కోరేందుకు పవన్ కళ్యాణ్ ఢిల్లీ వెళ్లినట్లు ఒక ప్రచారం అయితే మాత్రం జరిగింది. అయితే ఈరోజు సీఎం చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ రాజ్యసభ పదవుల కోసమేనన్న చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో జనసేనకు ఒక రాజ్యసభ పదవి ఖాయమని తెలుస్తోంది. ప్రధానంగా లింగమనేని రమేష్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కానీ ఇప్పుడు పవన్ కళ్యాణ్ చిరంజీవి పేరు తెరపైకి తెస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. చిరంజీవిని రాజ్యసభకు పంపితే జరిగే లాభనష్టాలు గురించి వారిద్దరూ చర్చించుకున్నట్లు కూడా టాక్ నడుస్తోంది. గతంలో కూడా చిరంజీవి విషయంలో రకరకాల ప్రచారాలు జరిగాయి. వైసిపి కూడా చిరంజీవిని రాజ్యసభకు ప్రమోట్ చేయాలని ప్రయత్నించినట్లు ఊహాగానాలు వచ్చాయి. అయితే ఇప్పుడు మరోసారి పవన్ చిరంజీవిని రాజ్యసభకు పంపిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అయితే రాజకీయాలకు దూరంగా.. సినిమాల్లో బిజీగా ఉన్నారు చిరంజీవి. అందుకే ఈ ప్రచారంలో ఎంత వాస్తవం ఉందనేది తెలియాలి.

# అరవ బలిపశువు అయ్యారా...

కడప, ఫిబ్రవరి 05: భారత శక్తి

రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారం వెనక కుట్ర జరిగిందన్న ప్రచారం జరుగుతుంది. అరవశ్రీధర్ చేసింది తప్పే. వివాహిత మహిళతో సంబంధాన్ని కొనసాగించడాన్ని ఎవరూ అంగీకరించరు. అలాగే మహిళ



కూడా ఎమ్మెల్యే కావడంతో అరవ శ్రీధర్ అంటే ఇష్టపడి దగ్గరయ్యారు. అయితే వీరు విడిపోవడానికి అనేక కారణాలు వినిపిస్తున్నాయి. అరవ శ్రీధర్ వ్యవహారంపై లైంగిక వేధింపులు రావడంతో జనసేన పార్టీ వెంటనే త్రిసభ్య కమిటీని నియమించింది. నిన్న విచారణ కూడా పూర్తి చేసింది. నివేదిక ఏమిస్తుందన్నది చూడాలి. అయితే అరవ శ్రీధర్ వ్యవహారంలో కొత్త కోణం బయటపడుతుంది. ఎస్సీ యువకుడు కావడంతో కొందరు కావాలనే తమ పట్టు నుంచి జారి పోతారని భావించి ఇద్దరి మధ్య గ్యాప్ క్రియేట్ చేశారంటున్నారు. జనసేన నేత, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై పోలీసు కేసు కూడా నమోదయింది. ఓ మహిళా ఉద్యోగి లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం సంచలనం కలిగించింది. మరొకవైపు అరవ శ్రీధర్ ను సదరు మహిళ పాతిక కోట్ల రూపాయలు డిమాండ్ చేసి బెదిరించిందని ఆరోపణలు కూడా వినిపించాయి. ఓ మహిళ మీడియా ముందుకు వచ్చి ఆరోపణలు చేసినా అరవ శ్రీధర్ పై కేసు నమోదు చేయలేదని విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఎట్టకేలకు అరవ శ్రీధర్ పై కేసు నమోదైంది. తిరుపతి జిల్లా ఎస్పీకి ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కూడా ఈ కేసులో దర్యాప్తును వేగంగా కొనసాగించి వాస్తవాలు బయటకు తీసుకు వచ్చే అవకాశాలున్నాయి. అయితే సాధారణంగా ఎస్సీ నియోజకవర్గం అంటే అగ్ర కులాల పెత్తనం ఉంటుంది. దాదాపు అన్ని ఎస్సీ నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ అదే పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ ఎస్సీ ఎమ్మెల్యేలపై అగ్రవర్ణాల నేతల పెత్తనం ఎక్కువగా కనపడేది. కొందరు ధైర్యంగా ఎదురుతిరుగుతారు. చాలా మంది ఎమ్మెల్యే పదవి చాలు అని మౌనంగా ఉంటారు. అరవ శ్రీధర్ కు రైల్వే కోడూరులో అసలు పనే లేదట. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ అసలు పెత్తనం చేసేది మాత్రం టీడీపీకి చెందిన నేతగా చెబుతున్నారు. అతని కనుసన్నల్లోనే ఈ వ్యవహారం సాగుతుంది. ఇద్దరు కలసి ఉండాలని భావించినా ఆ మహిళ అరవ శ్రీధర్ కు తోడుగా ఉంటే తమ పనులు చెల్లుబాటు కావని భావించి ఇద్దరినీ దూరం చేశారంటున్నారు. తొలి నుంచి అరవ శ్రీధర్ ఆ కుటుంబానికి సేవకుడిగానే ఉంటున్నారన్నది టాక్. గత ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ రైల్వే కోడూరు నియోజకవర్గం అభ్యర్థిగా యనమల భాస్కరరావును బహిరంగంగానే ప్రకటించారు. యనమల భాస్కర్ రావు స్వతంత్రంగా ఆలోచించే వ్యక్తి కావడంతో అతను ఎమ్మెల్యే అయితే తమ పనులు సాగవని భావించి టీడీపీ నేత ఒకరు చక్రం తిప్పి చివరి నిమిషంలో వైసీపీలో ఉన్న అరవ శ్రీధర్ ను జనసేనలోకి చేర్పించి టిక్కెట్ ఇప్పించారంటున్నారు. అరవ శ్రీధర్ ఏ ప్రారంభోత్సవం, శంకుస్థాపన, ప్రభుత్వ కార్యక్రమాల్లోనైనా నాలుగో స్థానంలోనే ఉంటారని చెబుతున్నారు. ఆ టీడీపీ నేత కుటుంబంలోని ముగ్గురు ముందు వరసలో ఉంటారు. పనిపాటా లేక ఈ యువతికి దగ్గరయ్యారన్నది అందుతున్న సమాచారం మేరకు తెలుస్తోంది. ఆ యువతి చదువుకున్నది కావడంతో తమకు ఇబ్బందిగా మారుతుందని భావించి టీడీపీ నేత ఇద్దరినీ దూరం చేయడంతోనే ఈ వివాదం రచ్చకెక్కిందంటున్నారు.

# పిపిపి విధానంలో కుంకుమసాగు

విశాఖపట్టణం, ఫిబ్రవరి 05: భారత శక్తి

పిపిపి మోడల్ కింద లంబసింగిలో పెద్ద ఎత్తున కుంకుమ పువ్వును పండించడానికి కంపెనీలకు అనుమతించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల పనితీరును సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, స్థానిక



గిరిజన వర్గాల భాగస్వామ్యంతో కుంకుమ పువ్వు సాగుకు పిలుపునిచ్చారు. “స్థానిక గిరిజన వర్గాల భాగస్వామ్యంతో పిపిపి (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్) మోడల్ కింద లంబసింగిలో పెద్ద ఎత్తున కుంకుమ సాగును చేపట్టడానికి సిద్ధంగా ఉన్న కంపెనీలకు అనుమతి ఉంటుంది’’ అని చంద్రబాబు ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా కశ్మీర్‌గా పిలుచుకునే లంబసింగి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లి మండలంలోని ఒక చిన్న గ్రామం. లంబసింగి ఇప్పటికే కాఫీ, మిరియాలు మరియు స్ట్రాబెర్రీ పంటలను పండిస్తోంది. ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సాగును అభివృద్ధి చేయాలని, అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాలతో పాటు అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. అరటి ఉత్పత్తిలో దక్షిణాది రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో ఉన్నప్పటికీ, ఎగుమతుల్లో లోపం ఉందని ముఖ్యమంత్రి గమనించారు. దానిపై ప్రధానంగా దృష్టి పెట్టి ఎగుమతులను పెంచాలని అధికారులకు సూచించారు. ఆక్వాకల్చర్ గురించి ఆలోచిస్తూ, ఆక్వాకల్చర్ కార్యకలాపాల నమోదు తప్పనిసరి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అతిపెద్ద సహజ వ్యవసాయ కేంద్రంగా మార్చడానికి చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. త్వరలోనే మామిడి ప్రాసెసింగ్ పరిశ్రమల యజమానులతో సమావేశం ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం కూడా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. విజయవాడలో పీపీపీ విధానంలో పూల మార్కెట్ నిర్మించడానికి కూడా చంద్రబాబు ఓకే చెప్పారు. డిజి రైతుబజార్ యాప్, వ్యవసాయ యంత్ర పరికరాలు అందించేందుకు ఏపీ ఏఐఎంఎస్ యాప్, కిసాన్ డ్రోన్ యాప్‌లను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. రాష్ట్రాన్ని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు సీఎం చంద్రబాబు. ఇప్పుడు 18 లక్షల మందికిపైగా రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చారని దాన్ని నాలుగేళ్లలో 50 లక్షలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రకృతి ఉత్పత్తులకు సర్టిఫికేషన్, ట్రేస్‌బిలిటీ సౌకర్యాలు పూర్తి చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై సుభాష్ పాలేకర్‌తో శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులు తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, దీంతో రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి, పంట ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందన్నారు చంద్రబాబు. ఏఐ ఆధారిత క్రాప్ అడ్వయిజరీ ‘భారత్ విస్తార్’ వంటి వాటిని రాష్ట్రంలోనూ వినియోగించుకోవాలన్నారు. యూఎస్, ఈయూతో ట్రేడ్ ఒప్పందం వేళ రాష్ట్రం నుంచి రొయ్యలు, ఎండుమిర్చి, మామిడి, వరి, ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతులు పెంచుకునేందుకు మరింత అవకాశం కలిగిందని అధికారులు వివరించగా, అయితే నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చూడాలని సీఎం అన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించి కేంద్ర పాలసీలకు అనుగుణంగా రాష్ట్ర పాలసీలు ఉండాలని చెప్పారు.

# లాభాల్లోకి వైజాగ్ స్టీల్ ప్లాంట్

విశాఖపట్టణం, ఫిబ్రవరి 05: భారత శక్తి

విశాఖ ఉక్కు మళ్లీ లాభాల్లోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం అందించిన ఊతం విశాఖ స్టీల్ ప్లాంట్ ను లాభాల దిశగా పయనింప చేసేందుకు దోహదపడింది. ఏడాదిన్నరలో అనూహ్య ప్రగతి సాధించిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ 2026 జనవరిలో యాభై నాలుగు కోట్ల లాభాన్ని ఆర్జించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిరంతరం అందిన సహకారంతో గతంలో ఎదుర్కొన్న నష్టాల నుంచి బయటపడిన విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రస్తుతం రోజుకు 19,401 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేస్తోందని ఆ ప్లాంట్ సీఎండీ ముఖ్యమంత్రికి వివరించారు. 2024-25 రెండో త్రైమాసికంలో రోజుకు కేవలం 9,215 టన్నుల హాట్ మెటల్ ను మాత్రమే ఉత్పత్తి చేయగలిగామని తెలిపారు. ప్రస్తుతం మూడు బ్లాస్ట్ ఫర్నేస్ లు పూర్తిగా పని చేస్తుండటంతో ఉత్పత్తి భారీగా పెరిగిందని అధికారులు సీఎంకు తెలియచేశారు. స్టీల్ ప్లాంట్ కెపాసిటీ యుటిలైజేషన్ లో రికార్డు స్థాయిలో 94 శాతానికి చేరుకుందని తెలిపారు. గత ఏడాది 45 శాతం మాత్రమే ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేయగలిగామని అన్నారు. పన్నులు, విద్యుత్ బకాయిలు, నీటి సరఫరా లాంటి వేర్వేరు అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారంతో ఆర్థికంగా నష్టాల నుంచి విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల దశకు చేరుకుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.11,440 కోట్ల సాయంతో స్టీల్ ప్లాంట్ నిలదొక్కుకుని మంచి ఫలితాలు సాధిస్తుందని చెప్పారు. 2026 జనవరిలో రూ.54 కోట్లు లాభాన్ని ఆర్జించగలిగామని తెలియచేశారు. ప్రస్తుతం ఆర్ఐఎన్ఎల్ కు క్రెడిట్ రేటింగ్ కూడా పెరిగినట్టు స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి అన్ని విభాగాల్లోనూ నూతన విధానాలను ప్రవేశపెట్టి స్టీల్ ప్లాంట్ ను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు.

# రాయలసీమకు మహర్ధశ

కర్నూలు, ఫిబ్రవరి 05: భారత శక్తి

ఆంధ్రప్రదేశ్‌లో మరో పోర్టుకు సంబంధించి లైన్ క్లియర్ అయ్యింది. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న దుగరాజుపట్నం పోర్టుకు సంబంధించిన భూసేకరణకు మార్గం సుగమం అయ్యింది. మొత్తం 2,170.70 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయం తీసుకున్నారు. కేంద్రం కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించడంతో ఇబ్బందులు తొలగిపోయాయి. ఇప్పటికే ఫీజుబులిటీ రిపోర్ట్ కూడా కేంద్రం దగ్గరకు వెళ్లింది. త్వరలోనే పోర్టుకు సంబంధించిన పనులు ప్రారంభం అవుతాయని భావిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రం సహకారంతో పోర్టులపై ఫోకస్ పెట్టింది. కొన్ని ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉండగా.. మరికొన్ని భూసేకరణ దశలో ఉన్నాయి. తాజాగా మరో కొత్త పోర్టుకు సంబంధించి అప్డేట్ వచ్చింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న తిరుపతి జిల్లా దుగరాజపట్నంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, నేషనల్ మెగా నౌకానిర్మాణ క్లస్టర్‌కు లైన్ క్లియర్ అయ్యింది. ఈ పోర్టుకు సంబంధించిన టెక్నికల్ ఫీజిబులిటీ నివేదికను రైట్స్ అనే సంస్థ సిద్ధం చేసి కేంద్రానికి పంపించారు. కేంద్రం బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించిందని.. త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందంటున్నారు. దుగరాజపట్నం పోర్టుకు సంబంధించి అవసరమైన టెక్నికల్ సహకారాన్ని విశాఖపట్నం పోర్టు అథారిటీ అందిస్తుందని చెబుతున్నారు.కేంద్రం సహకారంతో ఈ ప్రాజెక్టును దశలవారీగా అభివృద్ధి చేస్తారు.




కేంద్రం బడ్జెట్‌లో మారిటైంకు సంబంధించి బడ్జెట్‌లో రూ.1,765 కోట్లు కేటాయించగా.. వీటి నుంచి ఎక్కువ వాటా దుగరాజపట్నం ప్రాజెక్టుకు వస్తుంది అంటున్నారు. దుగరాజపట్నం గ్రీన్ ఫీల్డ్ పోర్టు–షిప్ బిల్డింగ్ క్లస్టర్ కోసం భూముల్ని సేకరించనున్నారు. దీని కోసం 2,170.70 ఎకరాల భూమి కావాలని ఇటీవల నివేదికలో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఏకంగా తిరుపతి జిల్లాలో 1,995.04 ఎకరాలు, నెల్లూరు జిల్లాలో 175.66 ఎకరాలు సేకరించాల్సి ఉంటుంది.తిరుపతి జిల్లాలోని వలవేడులో అత్యధికంగా 724 ఎకరాలు, ఆ తర్వాత వగ్రులో 529 ఎకరాలు, పామంజిలో 489 ఎకరాలు, పాతేటిపాలెంలో 251 ఎకరాలు సేరించాలని భావిస్తున్నారు. నెల్లూరు జిల్లాలో కోట మండలంలోని పుచ్చలపల్లిలో 129 ఎకరాలు, కొత్తపట్నంలో 46 ఎకరాలు సేకరించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.544.30 కోట్లను కేటాయించింది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే పూర్తి వివరాలు తెలుస్తాయంటున్నారు.రాష్ట్ర విభజన సమయంలో చట్టం ప్రకారం పోర్టుకు అవసరమైన నిధులు కేంద్రం నుంచి సమకూర్చాల్సి ఉంటుంది. ఈ మేరకు దుగరాజపట్నం పోర్టు ప్రాజెక్టుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డు రూ.30వేల కోట్ల ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్ట్ అందుబాటులోకి వస్తే.. ప్రతి ఏటా ఏకంగా 5లక్షల టన్నుల సరకు రవాణా చేయొచ్చు.. పోర్టుతో పాటుగా షిప్‌యార్డు, నౌకానిర్మాణంతో పాటుగా మరమ్మతుల వ్యవస్థ కూడా చేయొచ్చు. ఈ ప్రాజెక్టును మారిటైం బోర్డు, వీపీఏ (విశాఖపట్నం పోర్టు అథారిటీ) కలిసి అభివృద్ధి చేస్తాయి. వాస్తవానికి దుగరాజుపట్నం పోర్టు ప్రతిపాదనలు ఎన్నో ఏళ్లుగా ఉంది.. కానీ పేపర్ల వరకే పరిమితం అయ్యింది. ఇప్పుడు కేంద్రం సహకారంతో ఏపీ ప్రభుత్వం భూసేకరణ దిశగా అడుగులు వేస్తోంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే తిరుపతి, నెల్లూరు జిల్లాల రూపురేఖలు మారిపోతాయి అంటున్నారు.

# పార్టీ నిర్మాణంపై ఫోకస్

విజయవాడ, ఫిబ్రవరి 05: భారత శక్తి

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గత పాలనలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకునే ప్రయత్నంలో పడ్డారు. పార్టీ నిర్మాణం పై ఆయన ఫోకస్ పెట్టినట్లు పార్టీలో ప్రచారం జరుగుతుంది. గత ఎన్నికలలో ఓటమి పాలయి పదకొండు సీట్లకు పరిమితమయిన నాటి నుంచి జగన్ నోట కార్యకర్తల మాట పదే పదే వినిపిస్తుంది. ఒకరకంగా జగన్‌కు జ్ఞానోదయం అయింది. నియోజకవర్గాల వారీగా నేతలు అనుసరిస్తున్న తీరును ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్న జగన్ త్వరలోనే నియోజకవర్గానికి కార్యకర్తలతో కమిటీలు వేయాలని నిర్ణయించారని తెలిసింది. కార్యకర్తలకు ఇక ఐడి కార్డు, ఇన్స్యూరెన్స్ కల్పించనున్నారు. కార్యకర్తల్లో ఉన్న నిరాశను పారదోలాలంటే కార్యకర్తలను దగ్గరకు తీసుకునే ప్రయత్నాన్ని మొదలు పెట్టారన్నారు.వైఎస్ జగన్ ఎప్పుడూ తన బొమ్మతోనే గెలవాలని భావిస్తుంటారు. తన వల్లనే అధికారంలోకి రావాలని కోరుకుంటారు. 2019 ఎన్నికలలో పాదయాత్రతో అది జరిగినా, 2024 ఎన్నికల్లోనూ అదే మైండ్ సెట్ తో వెళ్లడంతో దారుణ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. అధికారంలో ఉన్నప్పుడు ఏ రోజు కూడా కార్యకర్తల సమాశాలను జరిపింది లేదు. ప్లీనరీ ఏదో ఒకసారి తప్పించి అసలు నిర్వహించలేదు. క్యాడర్ తో కలవడం, వారితో కలసి భోం చేయడం వంటి పనులకు దూరంగా ఉన్నారు. టీడీపీ మహానాడు నిర్వహించేది కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికే. జెండా పట్టుకునే వారికి కనీసం ఏడాదికి ఒకసారి అయినా పలకరించాలన్న ధ్యాసను జగన్ మర్చిపోవడం వల్లనే మొన్నటి ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద నిలబడే వారు లేకపోయారుఇక అధికారంలో ఉన్న ఐదేళ్లు పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఓటమి తర్వాత గ్రౌండ్ లెవెల్ లో పరిస్థితి అర్థమయింది. నేతలు బయటకు రావడం లేదు. ధైర్యంగా వచ్చే కార్యకర్తలు సయితం నిర్లక్ష్యానికి గురి కావడంతో దూరంగా ఉన్నారు. వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకున్న జగన్ ఇక కార్యకర్తలకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. పోలింగ్ బూత్ లను కార్యకర్తలతోనే నియమించాలని నిర్ణయించారు. వారికి అన్ని రకాల సదుపాయాలను పార్టీ పరంగా కల్పించాలని డిసైడ్ చేసినట్లు తెలిసింది. ఇక మరొకవైపు అభ్యర్థుల ఎంపికపై కూడా టీడీపీ తరహాలోనే తన నిర్ణయం కాకుండా కార్యకర్తలు, ఐవీఆర్ఎస్ ద్వారా జనాభిప్రాయాన్ని తీసుకోవాలని జగన్ నిర్ణయించినట్లు సమాచారం. మొత్తం మీద జగన్ కార్యకర్తలకు చేరువయ్యే ప్రయత్నాలు ఎంత వరకూ ఫలిస్తాయన్నది మాత్రం కాలమే సమాధానం చెబుతుంది.

===========

# కాంగ్రెస్, డీఎంకే మధ్య గ్యాప్

చెన్నై, ఫిబ్రవరి 05: భారత శక్తి

తమిళనాడు రాష్ట్రంలో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ నేపథ్యంలో అక్కడ రకరకాల సమీకరణాలు వెలుగులోకి వస్తున్నాయి. తమిళనాడు రాష్ట్రంలో ప్రస్తుతం డీఎంకే అధికారంలో ఉంది. స్టాలిన్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. డీఎంకే పార్టీ కాంగ్రెస్ లీడ్ చేస్తున్న ఇండియా కూటమిలో కీలక భాగస్వామిగా ఉంది. త్వరలో జరిగే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే పార్టీకి కాంగ్రెస్ మద్దతు పలుకుతోంది.ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ పరాశక్తి సినిమా తమిళనాడు రాష్ట్రంలో డీఎంకే, కాంగ్రెస్ పార్టీ మధ్య చిచ్చు పెట్టినట్టు వార్తలు వస్తున్నాయి. దీనికి సంబంధించి జరిగిన ఒక సంఘటన ఇప్పుడు ఆ రాష్ట్రంలో సంచలనంగా మారింది. తమిళనాడు రాష్ట్రంలో 1965లో హిందీ వ్యతిరేక పోరాటం జరిగింది. నాడు ఆ పోరాటాన్ని అన్నాదురై చేపట్టారు. హిందీ వ్యతిరేక ఉద్యమం జరుగుతున్నప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంది. నాడు ప్రధానమంత్రిగా ఇందిరాగాంధీ కొనసాగుతున్నారు.తమిళనాడులో డీఎంకే అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వలేదు. తమకు మంత్రి పదవులు ఎందుకు ఇవ్వలేదనే అడిగే హక్కు కాంగ్రెస్ పార్టీకి తమిళనాడులో లేదు. ఎందుకంటే గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడులో డీఎంకేకు బంపర్ మెజారిటీ వచ్చింది. ఏదోకూటమిలో ఉంది కాబట్టి కాంగ్రెస్ పార్టీతో డిఎంకె దోస్తీ కొనసాగించింది. అందువల్లే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలకు డీఎంకే మంత్రి పదవులు ఇవ్వలేదు.ఇటీవల సంక్రాంతి కానుకగా తమిళనాడు రాష్ట్రంలో పరాశక్తి అనే సినిమా విడుదలైంది. ఆ సినిమాలో శివ కార్తికేయన్ హీరోగా నటించాడు.

ఆ సినిమాలో అంశాలు వివాదాస్పదంగా మారాయి. ఇటీవల బడ్జెట్ కు సంబంధించి ఓ న్యూస్ ఛానల్ లో చర్చ నడిచినప్పుడు.. పరాశక్తి సినిమా చర్చకు వచ్చింది. ఈ సందర్భంగా డిఎంకే సంబంధించిన ఓ నాయకుడు హిందీ వ్యతిరేక ఉద్యమం గురించి ప్రస్తావించారు. ఈ క్రమంలో ఆ న్యూస్ ప్రజెంటర్ కల్పించుకొని నాడు డీఎంకే హిందీ వ్యతిరేక ఉద్యమం చేసినప్పుడు కేంద్రంలో అధికారంలో ఉంది కాంగ్రెస్ పార్టీ కదా అని అన్నారు. దీంతో డీఎంకే నాయకుడికి మాట్లాడే అవకాశం లేకుండా పోయింది. ఇప్పుడు ఇక పరాశక్తి సినిమా లో చూపించిన కొన్ని సన్నివేశాలు కాంగ్రెస్, డీఎంకే మధ్య విభేదాలను పెంచినట్టు వార్తలు వస్తున్నాయి. దీంతో కాంగ్రెస్ పార్టీలో చాలామంది నాయకులు విజయ పార్టీతో గుర్తుపెట్టుకోవాలని సూచిస్తున్నట్టు తెలుస్తోంది. అయితే దీనిపై కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వం ఇంతవరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే భవిష్యత్తులో ఏం జరుగుతుందో చూడాల్సి ఉందని అక్కడి రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో ఎయిడ్స్ మరణాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 05: భారత శక్తి

లుగు రాష్ట్రాల్లో హెచ్ఐవీ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. గతంలో కేసులు తగ్గినా.. ఇటీవలికాలంలో విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో మరణాలు పెరుగుతున్నాయి. కేంద్రం ప్రకారం, 2020?24 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో 32,642 మంది, తెలంగాణలో 11,498 మంది హెచ్ఐవీతో మరణించారు. మొత్తం 44,140 మరణాలు రికార్డు అయ్యాయి.ఏపీలో హెచ్ఐవీ మరణాల సంఖ్య గణనీయంగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో టెస్టింగ్,



చికిత్స సౌకర్యాల కొరత, అవగాహన లోపం కారణంగా వ్యాధి బాధితులు మరణిస్తున్నారు. రాష్ట్ర వైద్య శాఖ ఈ ట్రెండ్‌ను అరికట్టే చర్యలు చేపట్టాలి.తెలంగాణలో 11,498 మరణాలు రికార్డయ్యాయి. నగరాల్లో ఏఆర్‌టి సౌకర్యాలు మెరుగ్గా ఉన్నప్పటికీ, గ్రామాల్లో వ్యాప్తి, టెస్టింగ్ లోపాలు సమస్య. యువతలో వ్యాప్తి పెరుగుతోంది. వైరస్ గుర్తింపులో జాప్యం కారణంగా మరణాలు జరుగుతున్నాయి. వైద్య సేవల ఆలస్యం, స్టిగ్మా, టెస్టింగ్‌లో భయం మరణాలకు దారితీస్తున్నాయి. రెండు రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ప్రభావితమవుతున్నాయిహెచ్ఐవీ మరణాలు రెండు రాష్ట్రాల వైద్య వ్యవస్థల్లో లోపాలను సూచిస్తున్నాయి. ఉచిత టెస్టింగ్, ఏఆర్‌టీ మందులు, అవగాహన కార్యక్రమాలు పెంచాలి. యువతపై దృష్టి పెట్టి, స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేస్తే మరణాలు తగ్గుతాయి. కేంద్ర, రాష్ట్రాలు కలిసి చర్యలు తీసుకోవాలి.

# అంబటి అరెస్ట్ - వైసీపీ ప్లాన్ బి?

గుంటూరు, ఫిబ్రవరి 05: భారత శక్తి

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఇప్పుడు ఎవరికీ అర్థం కానంత గజిబిజిగా మారాయి. కొద్ది రోజులుగా తిరుమల లడ్డూ కల్తీ అంశంపై సిట్ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడం, అసలు నెయ్యే వాడలేదని చెప్పడం, మాజీ టీటీడీ అధికారుల పేర్లు బయటకు రావడం వైసీపీని డిఫెన్స్‌లో పడేసింది. అదే సమయంలో జంతువుల కొవ్వులేదన్న అంశం ఆధారంగా ఎదురుదాడి ప్రారంభించింది. ఈ సమయంలో హఠాత్తుగా రాజకీయం మారిపోయింది. మాజీ మంత్రి అంబటి రాంబాబు వంటి నేతలు ఉద్దేశపూర్వకంగా అత్యంత అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించడం ప్రారంభించారు. ఇదంతా ఓ డైవర్షన్ గేమ్‌గా కనిపిస్తోంది. అంబటి రాంబాబు కారులో కూర్చుని మీడియా ప్రతినిధిని పిలిపించుకుని మరీ బూతులు తిట్టడం యథాలాపంగా జరిగింది కాదని స్పష్టమవుతోంది. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రభుత్వం కచ్చితంగా స్పందిస్తుందని, అరెస్టులు జరుగుతాయని వారికి ముందే తెలుసు. అరెస్టు జరిగినప్పుడు దాన్ని రాజకీయ కక్ష గా చిత్రించడం, కాపు సామాజికవర్గ కార్డును వాడటం ద్వారా వైసీపీ తన క్యాడర్‌లో మళ్లీ ఊపు తీసుకురావాలని చూస్తోంది. అంబటిని 14 రోజుల రిమాండ్‌కు పంపడం, ఆయనపై 16కు పైగా కేసులు నమోదు కావడం ద్వారా ఒక రకమైన పొలిటికల్ విక్టిమైజేషన్ ఇమేజ్‌ను సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది.వైసీపీ నేతలు సృష్టించిన ఈ బూతుల డైవర్షన్ ట్రాప్‌లో పడకుండా కూటమి ప్రభుత్వం అప్రమత్తమైంది. అరెస్టులు, దాడుల వల్ల టాపిక్ మారుతోందని గమనించిన చంద్రబాబు నాయుడు, వెంటనే తన నేతలను అలర్ట్ చేశారు. చర్చను మళ్లీ లడ్డూ అంశంపైకే తీసుకువచ్చేలా మంగళవారం కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేవలం సిట్ నివేదికకే పరిమితం కాకుండా, అందులోని లోపాలను , అసలు సూత్రధారులను పట్టుకోవడానికి ఒక ప్రత్యేక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా వైసీపీ బూతుల డైవర్షన్ ప్లాన్‌ను చెక్




పెట్టి, మళ్లీ లడ్డూ అస్త్రంతోనే వారిని డిఫెన్స్‌లోకి నెట్టింది.ఏపీ రాజకీయాల్లో ఈ మలుపులు అంతా ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారమే సాగుతున్నట్లు కనిపిస్తోంది. వైసీపీ తరపున ప్లాన్ చేస్తున్నది ఎవరో కానీ.. చర్చను లడ్డూ కల్తీ వంటి సెంటిమెంట్ ఇష్యూ నుంచి రాజకీయ ప్రతీకారం ఇష్యూలోకి మార్చడంలో కొంతవరకు సక్సెస్ అయ్యారు. అయితే, చంద్రబాబు తన అనుభవాన్ని రంగరించి, కేబినెట్ నిర్ణయాల ద్వారా మళ్లీ బంతిని వైసీపీ కోర్టులోకి విసిరారు. ముఖ్యంగా పయ్యావుల కేశవ్ వంటి మంత్రులు ఈ కమిషన్ కేవలం విచారణే కాకుండా, సిస్టమ్‌లోని లోపాలను సరిదిద్దేందుకే అని చెప్పడం ద్వారా ప్రభుత్వానికి ఉన్న క్లీన్ ఇంటెన్షన్ ను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.రాజకీయ పార్టీలు తమ వ్యూహాల కోసం టాపిక్స్‌ను డైవర్ట్ చేస్తున్నా, ప్రజలు మాత్రం లడ్డూ కల్తీ వ్యవహారంలో దోషులు ఎవరో తెలియాలని బలంగా కోరుకుంటున్నారు. బూతులు మాట్లాడే నేతలకు చట్టం పవర్ చూపించడం ఒక ఎత్తు అయితే, భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారిని శిక్షించడం మరో ఎత్తు. వైసీపీ నేతలు సానుభూతి కోసం ప్రయత్నిస్తుంటే, కూటమి ప్రభుత్వం న్యాయం కోసం విచారణ కమిషన్‌ను నమ్ముకుంది. ఈ డైవర్షన్ గేమ్ లో అంతిమంగా ఎవరిది పైచేయి అవుతుందన్నది ముందు ముందు తెలియనుంది.

# అమరావతి ఓఆర్ఆర్ 250 అడుగులు...

అమరావతి, ఫిబ్రవరి 05: భారత శక్తి

ఏపీ రాజధాని అమరావతికి ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. గత నెలలో నోటిఫికేషన్ జారీ చేసి భూమిని సేకరిస్తున్నారు.ఈ క్రమంలో ఓఆర్ఆర్ భూసేకరణ 140 మీటర్ల వెడల్పు బదులు 250 మీటర్ల వెడల్పు కోసం చేపడుతున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ క్రమంలో రైతులు ఆందోళన వ్యక్తం చేయగా.. అధికారులు క్లారిటీ ఇచ్చారు. ఆందోళన అవసరం లేదన్నారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అన్ని జిల్లాలు కనెక్ట్ చేసేలా ఔటర్ రింగ్ రోడ్డు రాబోతోంది. అమరావతి ఓఆర్ఆర్‌కు సంబంధించి భూసేరణ ప్రక్రియ కూడా చేపట్టారు. గుంటూరు, పల్నాడుతో పాటుగా ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో భూసేకరణ చేపట్టారు. అయితే ఓఆర్ఆర్‌ను 140 మీటర్ల వెడల్పుతో నిర్మిస్తారని ప్రతిపాదించారు. అయితే అమరావతి ఔటర్‌కు సంబంధించిన గెజిట్‌లో మాత్రం 250 మీటర్లుగా పేర్కొన్నారట. దీంతో రైతులు అధికారుల్ని అడిగి క్లారిటీ తీసుకుంటున్నారట.. 250 మీటర్లు ముందు జాగ్రత్త మాత్రమేనని.. ఓఆర్ఆర్‌ను మాత్రం 140 మీటర్ల వెడల్పుతోనే నిర్మిస్తామని అధికారులు చెబుతున్నారట.

మామూలుగా అధికారులకు 3ఏ నోటిషికేషన్ ప్రక్రియ పూర్తి చేయకుండా భూమి సర్వేకు హక్కు ఉండదు అంటున్నారు. అప్పుడు కొలతలు తీసి హద్దులు వేయలేరని.. జీపీఎస్‌పై ఆధారపడాలి అంటున్నారు. జీపీఎస్‌ను 140 మీటర్ల వెడల్పు ప్రామాణికంగా తీసుకుని హద్దులు నిర్ణయిస్తే.. కొన్ని చోట్ల 5 నుంచి 10 మీటర్లు తేడా వస్తుంది అంటున్నారు. అదే జరిగితే ఈ ప్రక్రియ మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తుందని.. ప్రాజెక్ట్ ఆలస్యం అవుతుందంటున్నారు. అందుకే ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గెజిట్ నోటిఫికేషన్‌లో 250 మీటర్లుగా పేర్కొన్నారట. భూసేకరణకు సంబంధించి అభ్యంతరాలను స్వీకరించిన తర్వాత సర్వే పూర్తి చేసిన అనంతరం 140 మీటర్లకే కొలత వేసి








సరిహద్దులు వేస్తారు. ఆ మేరకు మాత్రమే భూమిని కూడా తీసుకుంటారు.. ఈ అంశాలను తుది నోటిఫికేషన్‌లో పొందుపరుస్తారని చెబుతున్నారు. ఎవరికి ఆందోళన అవసరం లేదంటున్నారు.అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని నాలుగు మండలాల్లోని గ్రామాల్లో భూసేకరణ కోసం గత నెలలో నోటిఫికేషన్ విడుదల చేశారు. అందులో ఓఆర్ఆర్ 140 బదులుగా 250 మీటర్ల భూసేకరణ ఉంటుందని పేర్కొన్నారు. అందుకే రైతులు ఒకింత ఆందోళనలో ఉన్నారట. 140 కాకుండా 250 తీసుకుంటే తాము నష్టపోతామన్నది రైతుల వాదన.. అధికారులు మాత్రం ఎలాంటి ఆందోళన అవసరం లేదంటున్నారు. రైతులకు ఎలాంటి అనుమానాలు అవసరం లేదని.. 140 మీటర్ల భూమి మాత్రమే తీసుకుంటామన్నారు.

# డ్వాక్రా మహిళల ఆందోళన

పల్నాడు ఫిబ్రవరి 05: భారత శక్తి

నరసరావుపేట స్టేడియం ఎదుట డ్వాక్రా మహిళలు ఆందోళనకు దిగారు. నరసరావుపేటకి చెందిన ఆర్ పి చల్లా కొటేశ్వరి మోసం చేసిందని చెబుతున్నారు. తమకు చెప్పకుండా తమ బ్యాంకు ఖాతాలో ఉన్న 32 లక్షల పొదుపు సొమ్ముని డ్రా చేసిందని మహిళలు ఆరోపణ. పోలీసులు,బ్యాంకు అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటున్నారు.

మొత్తం 120 మంది డ్వాక్రా మహిళలు కట్టిన డబ్బులు సొంతానికి కోటేశ్వరి వాడుకుంది. ఇప్పుడు డబ్బులు చెల్లించాలని బ్యాంకు అధికారులు నోటీసులు పంపుతున్నారని డ్వాక్రా బాధితులు చెబుతున్నారు. న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. మహిళలు ఆందోళనతో సత్తెనపల్లి నుంచి నరసరావుపేటకి కొద్దిసేపు వాహన రాకపోకలు నిలిచిపోయాయి.

# కాంగ్రెస్ పాలనకు రిఫరెండం...

హైదరాబాద్, ఫిబ్రవరి 05: భారత శక్తి

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు కనిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్, దూకుడు మీదున్న బీజేపీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అగ్రనేతలను రంగంలోకి దించగా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మాత్రం స్థానిక నేతలకే బాధ్యత వదిలేసింది. తెలంగాణలోని 123 మున్సిపల్ , 7 కార్పొరేషన్లకు జరుగుతున్న ఈ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ తన పాలనకు ఒక రెఫరెండంగా భావిస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల్లో పర్యటిస్తూ ప్రచారాన్ని హోరెత్తించాలని నిర్ణయించారు. పట్టణ ఓటర్లను ఆకట్టుకునేందుకు వరాల జల్లు కురిపిస్తూ, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా తన పట్టును నిరూపించుకోవాలని చూస్తున్నారు. కేడర్‌లో ఉత్సాహం నింపేలా ప్రతి మున్సిపాలిటీకి మంత్రులను ఇన్-ఛార్జులుగా నియమించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. బీజేపీ సైతం ఏమాత్రం తగ్గడం లేదు. జాతీయ అధ్యక్షుడు స్వయంగా ప్రచారానికి వస్తుండటమే కాకుండా, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి వారు గల్లీ గల్లీ తిరుగుతున్నారు. వీటికి అదనంగా, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రెండు రోజుల పాటు తెలంగాణలో బీజేపీ అభ్యర్థుల తరపున ప్రచారం చేయనుండటం ఆ పార్టీకి పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. జనసేన మద్దతుతో సెటిలర్ల ఓట్లను, యువత ఓట్లను గంపగుత్తగా కొల్లగొట్టాలన్నది బీజేపీ వ్యూహం. ఇంతటి భారీ యంత్రాంగాన్ని దింపడం ద్వారా రాష్ట్రంలో తామే ప్రత్యామ్నాయం అనే సంకేతాన్ని ఆ పార్టీ పంపిస్తోంది. ఈ హడావుడి మధ్య బీఆర్ఎస్ తీరు రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. గతంలో ప్రతి చిన్న ఎన్నికనూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకునే అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు ఈసారి ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. కేవలం ప్రెస్ మీట్లకే పరిమితమవుతూ, క్షేత్రస్థాయి ప్రచార బాధ్యతలను స్థానిక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్-ఛార్జులకే వదిలేశారు. అభ్యర్థుల ఎంపిక కూడా వారికే ఇచ్చారు. దీనివల్ల పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన స్తబ్దత నెలకొంది. బీఆర్ఎస్ ఈ ఎన్నికలను లైట్ తీసుకోవడం వెనుక లోతైన రాజకీయ కారణాలు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఎన్నికల్లో ఫలితాలు తారుమారైతే, ఆ ఓటమి బాధ్యతను తమపై వేసుకోకుండా తప్పించుకోవడానికే అగ్రనేతలు దూరంగా ఉంటున్నారన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగించడం ద్వారా.. ఫలితాలు బాగుంటే పార్టీ పుంజుకుందన్న ప్రచారం, తేడా వస్తే స్థానిక నేతల వైఫల్యంగా చూపించే వీలుంటుందని పార్టీ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. అయితే, ఇది కార్యకర్తలను నిరుత్సాహానికి గురిచేస్తోంది. కాంగ్రెస్ తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి, బీజేపీ తన బలాన్ని నిరూపించుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతుంటే.. బీఆర్ఎస్ మాత్రం డిఫెన్సివ్ మోడ్‌లో కనిపిస్తోంది.

====================

# జగన్ కు జాతీయ స్థాయిలో ఎవరు..

విజయవాడ, ఫిబ్రవరి 05: భారత శక్తి

ఏపీలో(కక్షపూరిత రాజకీయాలు నడుస్తున్నాయని ఆరోపిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో పోరాటం చేయాలని భావిస్తోంది. ఈరోజు ఆ పార్టీ ఎంపీలు పార్లమెంట్ వద్ద నిరసన తెలిపారు. ఏపీలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. మరోవైపు జాతీయస్థాయిలో ఉద్యమించాలని జగన్మోహన్ రెడ్డి భావిస్తున్నారు. పార్టీ నేతలతో ఈరోజు కీలక చర్చలు జరిపారు. రేపు గుంటూరు వెళ్లి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. శుక్రవారం మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటికి వెళ్ళనున్నారు. అయితే జాతీయస్థాయిలో టిడిపి కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టాలని చూస్తున్నారు జగన్. అన్ని రాజకీయ పార్టీలను కలవాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో కలిసి వచ్చే పార్టీలు ఏవి? అనే ప్రశ్న వినిపిస్తోంది. ఇప్పటివరకు బిజెపి అడిగిందే తడువుగా అన్ని రకాల సాయం అందిస్తూ వచ్చారు జగన్మోహన్ రెడ్డి. ఇప్పుడు అదే బిజెపి భాగస్వామ్యంతో నడుస్తున్న కూటమి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధపడుతున్నారు. దీంతో జాతీయస్థాయిలో కలిసి వచ్చే పార్టీలు ఏవి అనే ప్రశ్న ఉత్పన్నం అవుతోందికూటమి అధికారంలోకి వచ్చిన కొత్తలో ఇదే మాదిరిగా జగన్మోహన్ రెడ్డి) ఢిల్లీలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. దీక్ష కూడా చేశారు. ఆ సమయంలో ఇండియా కూటమి తరపున చాలా పార్టీలు వచ్చాయి. యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ వచ్చి సంఘీభావం ప్రకటించారు. ఒకటి రెండు పార్టీలు తమ ప్రతినిధులను పంపించాయి. అయితే అప్పట్లో జగన్మోహన్ రెడ్డి ఇండియా కూటమి వైపు చారకపోయినా జాతీయస్థాయిలో ఇతర పార్టీలతో స్నేహం చేస్తారని అంతా భావించారు. అయితే ఇండియా కూటమి పార్టీలతో స్నేహం చేస్తే బిజెపికి కోపం వస్తుందని భావించి వెనక్కి తగ్గారు. అందుకే ఇప్పుడు ఆ పార్టీలన్నీ జగన్మోహన్ రెడ్డికి వచ్చి మద్దతు తెలుపుతాయా? ఆ ఛాన్స్ ఉందా? అనేది మాత్రం తెలియడం లేదు. మొన్నటి ఎన్నికల ఫలితాల వరకు జగన్మోహన్ రెడ్డి కి జాతీయస్థాయిలో మంచి ఇమేజ్ ఉండేది. ఎందుకంటే పార్టీ ఆవిర్భావం తర్వాత 2014లో జరిగిన తొలి ఎన్నికల్లో 67 స్థానాలతో మంచి విజయాన్ని సొంతం చేసుకున్నారు. 2019 ఎన్నికల్లో ఏకంగా ప్రభంజనం సృష్టించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 175 సీట్లకు గాను 151 చోట్ల భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు. అందుకే జాతీయస్థాయిలో ప్రత్యేక స్థానం సంపాదించారు. కానీ అదే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 2024 ఎన్నికల్లో కేవలం 11 స్థానాలకు పరిమితం కావడంతో.. జగన్ పై ఉన్న అంచనాలు తప్పాయి. ఆయన ప్రజల నమ్మకాన్ని కోల్పోయారని జాతీయ పార్టీలు గుర్తించాయి. కేవలం చరిష్మపై ఆధారపడి ఆయన పార్టీని నడుపుతున్నారే తప్ప.. విధానపరమైన నిర్ణయాలు కానీ.. సిద్ధాంతాలు కానీ పట్టించుకోరు అన్న విమర్శ ఆయనపై ఉంది. అందుకే ఈసారి జాతీయస్థాయిలో ఉద్యమిస్తామని చెబుతున్న జగన్మోహన్ రెడ్డికి.. ఇతర పార్టీల మద్దతుపై అనేక రకాల అనుమానాలు ఉన్నాయి. చూడాలి మరి ఏం జరుగుతుందో??

# రెండో దశ మెట్రోపై బిగ్ అప్ డేట్

హైదరాబాద్, ఫిబ్రవరి 05: భారత శక్తి

హైదరాబాద్ నగరవాసులకు మెట్రో గుడ్‌న్యూస్ చెప్పింది. రెండో విడత విస్తరణకు సంబంధించి కీలక అప్‌డేట్ ఇచ్చింది. మొత్తం ఐదు కారిడార్లలో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రైలు మార్గాలను నిర్మించనున్నారు. నాగోల్-శంషాబాద్.. రాయదుర్గం-నియోపోలిస్.. ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట.. మియాపూర్-పటాన్‌చెరు.. ఎల్బీ నగర్-హయత్ నగర్ మార్గాల్లో మెట్రో అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టుకు రూ.24,269 కోట్ల అంచనా వ్యయం అవుతుందని భావిస్తున్నారు. హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా.. దాని వల్ల పెరుగుతున్న ట్రాఫిక్‌ను పెరగకుండా ఉంచేందుకు ఈ మెట్రో రెండో దశ విస్తరణ చాలా కీలకం కానుంది. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై బిగ్ అప్‌డేట్ వచ్చింది. మెట్రో విస్తరణలో భాగంగా రెండో దశలో మొత్తం 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గం నిర్మించనున్నారు. హైదరాబాద్ నగరవాసులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడంతోపాటు.. నగరంలోని మరిన్ని ప్రాంతాలకు మెట్రో రైలును విస్తరించేందుకు ఈ హైదరాబాద్ మెట్రో ఫేజ్-2ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మెట్రో విస్తరణ జరిగితే.. లక్షలాది మంది నగరవాసుల ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. మెట్రో ఫేజ్-2కు సంబంధించి హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్ తాజాగా ఒక ప్రకటనను రిలీజ్ చేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.24,269 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు.



ఈ హైదరాబాద్ మెట్రో ఫేజ్-2లో భాగంగా కొత్తగా మరో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాలు ఏర్పాటు కానున్నాయి. ఇక ఈ మెట్రో ఫేజ్-2 నిర్మాణానికి ఇప్పటికే తెలంగాణ సర్కార్.. పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. అంతేకాకుండా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అన్ని వివరాలతో కూడిన రిపోర్ట్‌ను కూడా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. ఇక ఈ మెట్రో ఫేజ్-2 నిర్మాణం కోసం కావాల్సిన 2787 ఎకరాల భూమిని సేకరించేందుకు ఈ ఏడాది జనవరిలోనే రాష్ట్ర మంత్రివర్గం భారీగా నిధులు కూడా మంజూరు చేసింది.

నాగోల్-శంషాబాద్ కారిడార్

మరోవైపు.. ఈ రెండో దశలో 5 కొత్త కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు. నాగోల్ నుంచి శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వరకు 36.6 కిలోమీటర్ల మేర కొత్తగా మెట్రో రైలు పరుగులు తీయనుంది. ఈ మార్గంలో 24 స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే ప్రయాణికులు.. రోడ్లపై ఉండే ట్రాఫిక్ భయం లేకుండా మెట్రోలోనే ఎయిర్‌పోర్ట్‌కు చేరుకునే అవకాశం ఉంటుంది. ఈ నాగోల్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంలో ఎక్కువ భాగం ఎలివేటెడ్ మార్గాన్నే నిర్మించనుండగా.. కొంత భాగం భూగర్భంలో 1.6 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు.

రాయదుర్గం-కోకాపేట్ నియోపోలిస్ కారిడార్

మరోవైపు.. రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపోలిస్ వరకు మరో కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నారు. 11.6 కిలోమీటర్ల ఈ మార్గంలో మొత్తం 8 స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ రాయదుర్గం- కోకాపేట్ నియోపోలిస్ కారిడార్ నిర్మాణం పూర్తి అయితే.. ఐటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారికి భారీ ఉపశమనం కలగనుంది. ఈ ప్రాంతాల్లో ఆఫీసులు ఉన్నవారికి.. మెట్రో అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది.

ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట కారిడార్

ఇక మరో కారిడార్‌లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు మెట్రో విస్తరణ చేయనున్నారు. 7.5 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ మార్గంలో 6 మెట్రో స్టేషన్లు ఉండనున్నాయి. ఈ మార్గం పూర్తి అయితే పాతబస్తీలో ఉన్న ప్రాంతాలకు కూడా మెరుగైన మెట్రో కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుంది.

మియాపూర్-పటాన్‌చెరు కారిడార్

వీటితోపాటు.. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మరో కారిడార్‌ను విస్తరించనున్నారు. 13.4 కిలోమీటర్ల మేర ఉండే ఈ కారిడార్‌లో 10 మెట్రో స్టేషన్లను నిర్మించనున్నారు. ముంబై హైవేపై ఇప్పటికే ఉన్న నాగోల్-మియాపూర్ రెడ్ లైన్ మార్గాన్ని మరింత దూరం విస్తరించనున్నారు.

ఎల్‌బీ నగర్-హయత్‌నగర్ కారిడార్

ఎల్‌బీ నగర్ నుంచి హయత్‌నగర్ వరకు రెండో దశ మెట్రో విస్తరణలో భాగంగా మరో కారిడార్ అందుబాటులోకి రానున్నాయి. 7.1 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ కారిడార్‌లో 6 స్టేషన్లను నిర్మించనున్నారు. మియాపూర్-ఎల్బీ నగర్ రెడ్ లైన్ మార్గాన్ని మరింత విస్తరించి.. విజయవాడ హైవేపై ఈ ఎల్బీనగర్-హయత్‌నగర్ కారిడార్ ఏర్పాటు కానుంది. ఈ 5 కారిడార్లలో మెట్రో అందుబాటులోకి వస్తే.. రోడ్లపై వాహనాల రద్దీ భారీగా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మెట్రో రెండో దశ ప్రాజెక్టు పూర్తయి.. హైదరాబాద్ శివార్ల వరకు కూడా కనెక్టివిటీ జరిగితే.. ఆయా ప్రాంతాల్లో నివసించే మధ్యతరగతి ఉద్యోగులకు భారీగా ప్రయోజనం కలగనుంది.

====================


# పక్కా ప్లాన్ తో గులాబీ వ్యూహం

హైదరాబాద్, ఫిబ్రవరి 05: భారత శక్తి

పురపోరుతో మళ్లీ గాడిన పడి పూర్వవైభవం దిశగా సాగాలని భారత రాష్ట్ర సమితి ఆశాభావంగా వెళ్తోంది. సర్పంచ్ ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో పార్టీ గుర్తులతో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో మెరుగైన స్థానాలు దక్కించుకోవాలని గులాబీ పార్టీ భావిస్తోంది. బాకీ కార్డుల ద్వారా కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూనే పదేళ్ల కేసీఆర్ హయాంలో చేసిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఇందుకోసం మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు పార్టీ తరపున సమన్వయకర్తలను కూడా నియమించారు. పెద్దపెద్ద సమావేశాలు, రోడ్ షోలు లేకుండా స్థానికంగానే ప్రచారం నిర్వహించాలని బీఆర్?ఎస్ నిర్ణయించింది.వరుస ఎన్నికల్లో ఓటమితో ఇబ్బంది పడుతున్న భారత రాష్ట్ర సమితి ఇటీవలి పంచాయతీ ఎన్నికల ఫలితాలతో కాస్త హుషారుగా కనిపిస్తోంది. సర్పంచ్ ఎన్నికల్లో నాలుగు వేలకు పైచిలుకు స్థానాలు పార్టీ మద్దతు దారులు గెలుపు పొందారని అంటున్న బీఆర్?ఎస్ అదే ఉత్సాహంతో పట్టణ ప్రాంత స్థానిక సంస్థల ఎన్నికల బరిలో దిగుతోంది. ఎన్నికలు జరుగుతున్న 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లలో మెరుగైన సంఖ్యలో స్థానాలే లక్ష్యంగా ముందుకెళ్తోంది. ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాల వారీగా ప్రజాప్రతినిధులు, ఇన్చార్జులు పార్టీ జిల్లా అధ్యక్షులతో హరీశ్ రావు, కేటీఆర్?లు సమావేశమయ్యారు.ఆయా పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల సన్నద్ధతను సమీక్షించి నేతలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో గెలుపు ఆవశ్యకత గురించి వారికి పూర్తిస్థాయిలో వివరించారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు పంచాయతీ ఎన్నికలే నిదర్శనంగా బీఆర్?ఎస్ అభివర్ణిస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో పరిస్థితి మరింత ఆశాజనకంగా ఉంటుందని సద్వినియోగం చేసుకుని పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని భావిస్తోంది. మున్సిపల్ ఎన్నికల వేళ చేరికలపై కూడా గులాబీ పార్టీ దృష్టి సారించింది. స్థానికంగా మంచి పేరు, రాజకీయంగా బలం ఉన్న నేతలను పార్టీలో చేర్చుకుంటున్నార లోక్?సభ ఎన్నికలకు ముందు పార్టీని వీడి బీజేపీలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మళ్లీ సొంతగూటికి వచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి ప్రతి ఒక్క వార్డులోనూ బరిలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఎట్టి పరిస్థితుల్లోనూ అధికార పార్టీ ఒక్క వార్డును కూడా ఏకగ్రీవం చేసుకోకుండా చూడాలని అధిష్టానం స్పష్టం చేస్తోంది. అభ్యర్థిత్వాల ఎంపిక విషయంలోనూ పూర్తి జాగ్రత్తగా ఉండాలని గెలుపే ప్రాతిపదికన ఖరారు చేయాలని దిశానిర్దేశం చేస్తోంది. ఒకరి కంటే ఎక్కువ సంఖ్యలో ఆశావహులు ఉన్నచోట అవకాశం రాని వారిని బుజ్జగించి, రెబెల్స్?కు ఆస్కారం లేకుండా చూసేందుకు ప్రణాళికలు వేస్తోందిఎన్నికలు జరుగుతున్న పురపాలికల్లో ప్రత్యేకంగా సమన్వయకర్తలను పార్టీ నియమించింది. ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ వారి సమన్వయంతో జరిగేలా, క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు అధిష్టానానికి చేరవేసేలా ఈ ఏర్పాటు చేశారు. స్థానిక నేతలను సమన్వయం చేయడంతోపాటు అభ్యర్థుల ఎంపిక, నామినేషన్లు, ప్రచారం, వ్యూహం లాంటి వాటిలో సమన్వయకర్తలు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. బాకీ కార్డుల ద్వారా మున్సిపల్ ఎన్నికల ప్రచారం కొనసాగించాలని బీఆర్?ఎస్ తీర్మానించింది. ఇందులోభాగంగా శాసనసభ ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమల్లో వైఫల్యాలు ప్రశ్నిస్తూ ఇంటింటికీ బాకీ కార్డులు పంపిణీ చేయనున్నారు. 25 నెలల కాంగ్రెస్ పాలనలో ఎవరికి ఎంత బాకీ పడ్డారో అందులో ముద్రించారుఇదే సమయంలో పదేళ్ల కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూనే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు నాయకత్వం సూచించింది. పూర్తిగా జిల్లాస్థాయిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నారు. పెద్దపెద్ద సభలు, సమావేశాలు, రోడ్ షోలు లేకుండా ప్రతి ఓటరును కలిసేలా ఇంటింటి ప్రచారం నిర్వహించేలా వ్యూహాలు రచిస్తున్నారు. ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడం ద్వారా రానున్న శాసనసభ ఎన్నికలకు మార్గం సుగమమం చేసుకోవాలని బీఆర్?ఎస్ భావిస్తోంది. కేసీఆర్?ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలన్న లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలంటే ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు రాబట్టాలని లక్ష్యంగా పెట్టుకొంది.

# శిల్పా బృందావన్ కాలనీలో అక్రమణాలను తొలగించిన హైడ్రా

## సెప్టిక్ ట్యాంక్ స్థలంతో పాటు 4 ఎకరాల ప్రభుత్వ భూమికి హైడ్రా ఫెన్సింగ్



హైదరాబాద్, ఫిబ్రవరి 05: భారత శక్తి

లే అవుట్‌లలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను ఆక్రమిస్తున్న వారిపై 'హైడ్రా' (న్ణ=ూూ) కొరడా ఝుళిపించింది. కూకట్‌పల్లి జోన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ సర్కిల్ శిల్పా బృందావన్ కాలనీలో సెప్టిక్ ట్యాంక్ స్థలాన్ని, దాని పరిసరాల్లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి ప్లాట్లుగా మారుస్తున్న ఉదంతాన్ని గుర్తించిన అధికారులు గురువారం వాటిని స్వాధీనం చేసుకున్నారు.

ఫిర్యాదుతో కదిలిన యంత్రాంగం:

గతంలో లే అవుట్ వేసిన సమయంలో సెప్టిక్ ట్యాంక్ కోసం కేటాయించిన స్థలాన్ని, దాని పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశాన్ని వైవీ రావు అనే వ్యక్తి ఆక్రమిస్తున్నట్లు కాలనీ నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ వచ్చాక ఈ స్థలాలను పార్కుల కోసం వినియోగించాలి. అయితే, శిల్పా డెవలపర్స్‌తో కలిసి సదరు వ్యక్తి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని సైతం కలిపేసి, అక్రమంగా ప్లాట్లు చేస్తున్నట్లు కాలనీవాసులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. లే అవుట్ హద్దులను చెరిపివేసి రహదారుల నిర్మాణం కోసం ప్రయత్నిస్తున్నట్లు ఫిర్యాదు అందడంతో హైడ్రా కమిషనర్ ఆదేశాల మేరకు రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు.

రూ. కోట్ల విలువైన భూమికి రక్షణ:

అధికారుల పరిశీలనలో సెప్టిక్ ట్యాంక్ ప్రాంతంలో సుమారు 20 గుంటల మేర ఆక్రమణకు గురైనట్లు తేలింది. దీనితో పాటు అనుమతి లేని లే అవుట్ పేరుతో ఆక్రమించిన దాదాపు 4 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు గుర్తించారు. సామాన్యులు ప్లాట్లు కొని మోసపోకుండా ఉండేందుకు సదరు స్థలం చుట్టూ గురువారం ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి ప్రభుత్వ భూములను, ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను కాపాడటంపై శిల్పా బృందావన్ కాలనీ నివాసితులు హర్షం వ్యక్తం చేశారు.




# వశిష్ట లాడ్జిలో వ్యభిచారం

## గుట్టురట్టు చేసిన ఏహెచ్ టియు బృందం

ఎల్బీనగర్, ఫిబ్రవరి 05 (భారత శక్తి):ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రైవేట్ లాడ్జిని అనుమతి లేకుండా ఓయో బోర్డులు ఏర్పాటు చేసి వ్యభిచార దందా నిర్వహిస్తున్న లాడ్జిపై ఆంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ బృందం దాడులు చేసింది. ఈ కేసుకు సంబంధించి ఎల్బీనగర్ సీఐ కే. వినోద్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కామినేని చౌరస్తా నుండి సిరీస్ రోడ్ లో శివగంగా కాలనీ ప్రధాన రహదారిపై ఉన్న వశిష్ఠ రెసిడెన్సీ లగ్జరి రూమ్స్ లో అనుమతులు లేకుండా ఓయో బోర్డులు ఏర్పాటు చేసి హోటల్ యాజమాన్యం వినియోగదారుల నుండి డబ్బులు వసూలు చేస్తూ వ్యభిచారం నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు ఎల్బీనగర్ పోలీసులు మల్కాజిగిరి యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ బృందం దాడులు నిర్వహించింది. ఈ దాడులలో వ్యభిచారం చేస్తున్న మహిళ, విటుడు అభిలాష్ తో పాటు రెసెప్షనిస్ట్ నారాయణను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. వీరివద్ద నుండి కండోమ్ ప్యాకెట్లు, సెల్ ఫోన్ లు స్వాదీనం చేసుకున్నామని మహిళను ప్రజ్వల హోమ్ కు తరలించినట్లు తెలిపారు. హోటల్ యజమాని హేమంత్ పరారిలో ఉన్నాడని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఐ వినోద్ కుమార్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే ఉపేక్షించబోమని అన్నారు.

### రాజకీయ 'ఆడియో' సెగ..

# మన్సూరాబాద్‌లో దుమారం!

### కార్పొరేటర్ తీరుపై విమర్శలు.. రఘువీర్ రెడ్డి ప్రచారం వెనుక వ్యూహమేంటి? పక్కా ప్రణాళికతోనే బయటకు తెచ్చారా? రాజకీయ వర్గాల్లో చర్చ




మన్సూరాబాద్, ఫిబ్రవరి 5 భారత శక్తి:

రాజధాని శివారులోని మన్సూరాబాద్ డివిజన్ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డికి సంబంధించినట్లుగా చెబుతున్న ఒక ఆడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఒకవైపు కార్పొరేటర్ వాడిన పదజాలంపై విమర్శలు వెల్లువెత్తుతుండగా, మరోవైపు ఈ వ్యవహారాన్ని ప్రత్యర్థి పార్టీ నేత, బీఆర్ఎస్ నాయకుడు జక్కిడి రఘువీర్ రెడ్డి సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ప్రచారం చేయడం వెనుక 'రాజకీయ వ్యూహం' ఉందనే చర్చ మొదలైంది.

వివాదం నేపథ్యం ఇదీ..

ఎల్పీటీ మార్కెట్ సమీపంలోని ఒక భారీ అపార్ట్‌మెంట్ డ్రైనేజీ అనుసంధానం విషయంలో గత కొద్ది రోజులుగా స్థానిక కాలనీ వాసులకు, బిల్డర్లకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. నిబంధనలకు విరుద్ధంగా డ్రైనేజీ లైన్ కలుపుతున్నారని, దీని వెనుక కార్పొరేటర్ హస్తం ఉందనేది ప్రధాన ఆరోపణ. ఈ నేపథ్యంలో సొంత పార్టీకి చెందిన ఒక బీసీ కార్యకర్త దీనిపై నిలదీయగా, కార్పొరేటర్ తీవ్ర ఆగ్రహానికి లోనై అసభ్య పదజాలంతో దూషించినట్లు ఆడియో ద్వారా తెలుస్తోంది.

రాజకీయ కుట్రనా? వాస్తవమా?

ఈ ఆడియో క్లిప్‌ను బీఆర్ఎస్ నాయకుడు జక్కిడి రఘువీర్ రెడ్డి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఇది కేవలం ఆరోపణలకే పరిమితం కాకుండా రాజకీయ రంగు పులుముకుంది.

బీఆర్ఎస్ విమర్శ: ప్రజాప్రతినిధి హోదాలో ఉండి కార్యకర్తలను, బీసీ సామాజిక వర్గాన్ని అవమానించడం క్షమించరాని నేరమని రఘువీర్ రెడ్డి వర్గం ఆరోపిస్తోంది.

బీజేపీ అనుమానం: అయితే, ఎన్నికల ముందే లక్ష్యంగా చేసుకుని, ఫోన్ సంభాషణలను రికార్డ్ చేయడం వెనుక పక్కా రాజకీయ కుట్ర దాగి ఉందని బీజేపీ శ్రేణులు అనుమానిస్తున్నాయి. కేవలం ఒక వర్గాన్ని ప్రసన్నం చేసుకునేందుకే రఘువీర్ రెడ్డి దీనిని ఇంతలా వైరల్ చేస్తున్నారని వారు వాదిస్తున్నారు.

వరుస ఘటనలపై ఆందోళన:

గతంలోనూ కార్పొరేటర్ పై ఇటువంటి ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో, తాజా ఘటన ఆయనకు రాజకీయంగా ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా కుర్మ సామాజిక వర్గానికి చెందిన కార్యకర్తను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు డివిజన్‌లోని బీసీ వర్గాల్లో చర్చకు దారితీశాయి. ఇది సహజంగా జరిగిన ఆగ్రహావేశమా లేక పథకం ప్రకారం జరిపిన కుట్రనా అనే కోణంలో స్థానికులు విశ్లేషిస్తున్నారు.

పార్టీల స్పందన కోసం ఎదురుచూపు:


నిబద్ధతకు మారుపేరని చెప్పుకునే బీజేపీ అధిష్టానం ఈ ఆడియో క్లిప్‌పై ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. మరోవైపు, ఈ అంశాన్ని అందిపుచ్చుకున్న బీఆర్ఎస్ నేత రఘువీర్ రెడ్డి, దీనిని క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి రాజకీయ ప్రయోజనం పొందే ప్రయత్నాల్లో ఉన్నారు. వాస్తవాలు ఏవైనప్పటికీ, ఈ 'ఆడియో వార్' మన్సూరాబాద్‌లో వ్యక్తిగత దూషణలు ఏ స్థాయికి చేరాయో అద్దం పడుతోంది.

# టీచర్స్ కాలనీలో 'ఓపెన్ జిమ్' పనులకు శంకుస్థాపన

### రూ. 21 లక్షలతో అభివృద్ధి పనులు.. ప్రారంభించిన కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి..

వనస్థలిపురం, ఫిబ్రవరి 5: భారత శక్తి,

బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని పంచాయతీరాజ్ టీచర్స్ కాలనీ ఫేస్-2లో నివాసితుల సౌకర్యార్థం రూ. 21 లక్షలతో చేపట్టనున్న ఓపెన్ జిమ్, చిన్నారుల ఆట పరికరాల ఏర్పాటు పనులకు స్థానిక కార్పొరేటర్



మొద్దు లచ్చిరెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు.

?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసుల ఆరోగ్య సంరక్షణ కోసం జిమ్ పరికరాలను, పిల్లల వినోదం కోసం ప్రత్యేక ఆట వస్తువులను త్వరలోనే అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు టీచర్స్ కాలనీ ఫేస్-2 అధ్యక్షులు శివ ముదిరాజ్, చైతన్య నగర్ కాలనీ అధ్యక్షులు సంజీవరెడ్డి, మాజీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, జలంధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, కోశాధికారి మహిపాల్ రెడ్డి, సంజీవ యాదవ్, రామారావు పాల్గొన్నారు. అలాగే రామ్ రెడ్డి, వీరభద్ర రావు, జగదీష్ రెడ్డి, సాయి రెడ్డి, చైతన్య నగర్ కాలనీ సెక్రటరీ యాదయ్య, కోశాధికారి చంద్ర శేఖర్ రెడ్డి, వినోద్, శివ, జనార్దన్ రెడ్డి, పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు.

# న్యాయవాది స్వప్న హత్యకు నిరసనగా రంగారెడ్డి కోర్టులో కొవ్వొత్తుల ర్యాలీ

ఎల్బీనగర్, ఫిబ్రవరి 5: భారత శక్తిమొయినాబాద్‌కు చెందిన చేవెళ్ల బార్ అసోసియేషన్ న్యాయవాది స్వప్నపై జరిగిన అమానుష దాడిని, ఆమె దారుణ హత్యను నిరసిస్తూ రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో గురువారం సాయంత్రం భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. యువ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పొన్నం రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో



న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వప్న ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులర్పించారు.

న్యాయవ్యవస్థపై జరిగిన దాడి

ఈ సందర్భంగా పొన్నం రవీందర్ మాట్లాడుతూ.. ప్రజలకు న్యాయం అందించడంలో కీలక పాత్ర పోషించే న్యాయవాదిపై ఇలాంటి కిరాతక దాడి జరగడం ప్రజాస్వామ్య వ్యవస్థకే గొడ్డలిపెట్టు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది కేవలం ఒక వ్యక్తిపై జరిగిన దాడి కాదని, యావత్ న్యాయవ్యవస్థను భయభ్రాంతులకు గురిచేసే చర్య అని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై ఇప్పటికే జాతీయ మానవ హక్కుల కమిషన్ (చీఎ=జ)లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

ప్రధాన డిమాండ్లు:

న్యాయవాదుల భద్రత కోసం ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరుతూ పలు డిమాండ్లను వారు ముందుకు తెచ్చారు:

?ఫాస్ట్ ట్రాక్ కోర్టు: స్వప్న హత్య కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు అప్పగించి, నిందితులకు త్వరితగతిన కఠిన శిక్ష పడేలా చూడాలి.

అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్:

న్యాయవాదులపై పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు తక్షణమే 'న్యాయవాదుల రక్షణ చట్టాన్ని' అమల్లోకి తీసుకురావాలి.

వృత్తిపరమైన భద్రత: విధి నిర్వహణలో ఎదురవుతున్న బెదిరింపులు, దాడుల నుండి న్యాయవాదులకు ప్రత్యేక రక్షణ కల్పించాలి.

తరలివచ్చిన న్యాయవాద లోకం:

రాష్ట్రవ్యాప్త నిరసనల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ న్యాయవాదుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలే నరసింహ, హైకోర్టు న్యాయవాది కొంగల మోహన్ గౌడ్, మహిళా న్యాయవాదులు రూప తాటికొండ, భాగ్య తో పాటు దామరుప్పుల కుమారస్వామి, క్రాంతి రెడ్డి, నగేష్, వీరన్న, విజయ్ కుమార్, గంగబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం స్పందించి న్యాయవాదులకు భరోసా కల్పించే వరకు తమ పోరాటం ఆగదని వారు స్పష్టం చేశారు.

# ముమ్మరంగా జీహెచ్ఎంసీ ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్

## మూడు రోజుల్లో 342 మెట్రిక్ టన్నుల వ్యర్థాల తరలింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 : భారత శక్తి

భాగ్యనగరంలో పరిశుభ్రతే లక్ష్యంగా జీహెచ్ఎంసీ చేపట్టిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం (స్పెషల్ సానిటేషన్ డ్రైవ్) ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ నెల 3న ప్రారంభమైన ఈ ప్రత్యేక డ్రైవ్ గురువారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. నగరంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత వీధుల్లోనూ పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడమే ధ్యేయంగా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు.

డివైడర్లు, సెంట్రల్ మీడియంలపై దృష్టి

డ్రైవ్‌లో భాగంగా మూడో రోజైన గురువారం రహదారులకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని సిబ్బంది క్లీన్ చేశారు. ముఖ్యంగా రోడ్డు డివైడర్లు, కెర్బ్ స్టోన్స్, సెంట్రల్ మీడియంలపై పేరుకుపోయిన ధూళి, వ్యర్థాలను తొలగించడంపై ప్రత్యేక దృష్టి సారించారు. నగరంలోని 300 వార్డుల పరిధిలో ఉన్న సుమారు 316 సమస్యాత్మక ప్రాంతాల్లో ఈ పారిశుద్ధ్య పనులు చురుగ్గా సాగుతున్నాయి.

అదనపు వ్యర్థాల సేకరణ ఇలా..

గత మూడు రోజుల్లో సాధారణంగా సేకరించే చెత్తకు




అదనంగా భారీ స్థాయిలో వ్యర్థాలను అధికారులు తరలించారు:

సాధారణ వ్యర్థాలు: 269 మెట్రిక్ టన్నులు

నిర్మాణ వ్యర్థాలు (C&D Waste): 73 మెట్రిక్ టన్నులు

మొత్తం: 342 మెట్రిక్ టన్నులు

క్షేత్రస్థాయిలో అధికారుల తనిఖీ:

ఈ ప్రత్యేక డ్రైవ్‌ను జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడికక్కడ సిబ్బందికి దిశానిర్దేశం చేస్తూ, సేకరించిన వ్యర్థాలను వెనువెంటనే డంపింగ్ యార్డులకు తరలించేలా చర్యలు చేపట్టారు. నగరాన్ని సుందరంగా మార్చడంలో భాగంగా చేపట్టిన ఈ కార్యక్రమం పట్ల పౌరుల నుంచి సానుకూల స్పందన వ్యక్తమవుతోంది.


# అభివృద్ధి పనుల పర్యవేక్షణలో కార్పొరేటర్..

హయత్‌నగర్, ఫిబ్రవరి 5: భారత శక్తి,

హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి గురువారం పరిశీలించారు. సాయిబాబా కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను స్థానికులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

అనుమగల్‌లో పర్యటన:

బస్తీ వాసుల విజ్ఞప్తి మేరకు అనుమగల్ ప్రాంతంలో నవజీవన్ రెడ్డి పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. అక్కడ సీసీ రోడ్ల అవసరాన్ని గుర్తించిన ఆయన, వెంటనే అంచనాలు రూపొందించి పనులు



ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, కాలనీ అధ్యక్షులు రమేష్, ప్రతినిధులు మహేందర్, కుమార్, ఈశ్వర్, శ్రీరాములు, గిరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి :జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.

భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 05 (భారతశక్తి):

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడీఓసీ లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫిరెన్స్ ద్వారా జిల్లా స్థాయి రహదారి భద్రతా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా జనవరి నెలలో 49 రోడ్డు ప్రమాదాలు జరగగా 17 మంది మృతి చెందినట్లు తెలిపారు. ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో మరొక్క ప్రాణం పోకుండా తక్షణమే అవసరమైన అన్ని నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి నెల ప్రమాదాల వివరాలను సమీక్షిస్తూ, ప్రమాదాలకు దారి తీసే కారణాలను గుర్తించి వాటి నివారణకు ముందస్తు చర్యలు



తీసుకోవాలన్నారు. రహదారుల మరమ్మతుల కోసం ప్రత్యేకంగా రోడ్డు రిపేర్ గ్యాంగ్‌ను ఏర్పాటు చేయాలని, రహదారుల మరమ్మతులకు అవసరమైన సామాగ్రి, పనిముట్లు, వనరులపై సమగ్ర నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రమాదాలకు కారణమయ్యే గుంతలు, దెబ్బతిన్న రహదారులు, సూచికల లేమి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పాఠశాలల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమాదాలు, రహదారి భద్రత అంశాలపై అవగాహన కల్పించే వీడియోలు, చిత్రాలను ప్రదర్శించాలని ఆదేశించారు. ఎన్సీసీ విద్యార్థుల ద్వారా హెల్మెట్ వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రతి బ్లడ్ బ్యాంకులో రక్త నిల్వలపై క్రమం తప్పకుండా నివేదికలు అందించాలని, ఎక్కడైనా రక్త కొరత ఉన్నట్లయితే వెంటనే రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. రహదారి ప్రమాదాలు జరిగిన అత్యవసర సమయాల్లో బాధితులకు తక్షణ వైద్య సేవలు అందేలా వైద్య శాఖ అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా సమగ్ర ట్రాఫిక్ మేనేజ్మెంట్ ప్లాన్ రూపొందించాలని, ఎక్కడ సిగ్నల్ లైట్లు అవసరమో, డైవర్షన్లు, డివైడర్లు, ప్రమాద సూచికలు తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు వివరమైన నివేదికలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారులపై చేపడుతున్న మరమ్మతులు, కనెక్టివిటీ రహదారుల పనులను రెండు వారాల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ ప్రమాదాలు జరిగిన ప్రదేశాల్లో నిర్ణీత కాలపరిమితిలో తగిన చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 38 బ్లాక్ స్పాట్లు, 62 ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రదేశాలను గుర్తించినట్లు వెల్లడించారు. ఈ ప్రాంతాల్లో సంబంధిత శాఖల అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టి, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలు అమలు చేయాలని సూచించారు. అవసరమైన చోట ట్రాఫిక్ సిగ్నల్స్, అనుమతులు, ఇతర సాంకేతిక చర్యలు వేగంగా చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి డిఈ నాగేశ్వరరావు సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఫ్లాగ్ మార్చ్

జగద్గిరిగుట్ట, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 5:

రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈరోజు జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు జీనోమ్ వ్యాలీ ఎస్‌హెచ్‌వో గోపగాని గురువయ్య తెలిపారు. జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ సిబ్బంది, జగద్గిరిగుట్ట పోలీస్ సిబ్బంది కలిసి గ్రామంలో ఫుట్ ప్యాట్రోలింగ్ నిర్వహిస్తూ అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచినట్లు తెలిపారు. ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడంతో పాటు విజిబుల్ పోలీసింగ్, శాంతి భద్రతలను కట్టుదిట్టంగా అమలు చేయడానికి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.



# లైంగిక దాడి కథనాలపై మహిళా కమిషన్ సీరియస్...!

మేడారం/ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 5 (భారత శక్తి) : మేడారం జాతరలో లైంగిక దాడి జరిగిందన్న ఆరోపణలపై జాతీయ మహిళా కమిషన్ సీరియస్ గా స్పందించింది. ములుగు జిల్లా తాడ్వాయి మండల మేడారంలోని సమ్మక్క సారలమ్మ మహా జాతర జనవరి 28 నుండి 31 వరకు నిర్వహించిన జాతర సమయంలో ఛత్తీస్గఢ్ కు చెందిన ఐదుగురు యువకులు బాలికపై గ్యాంగ్ రేప్ చేశారంటూ మీడియాలో, సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కథనాలను ఎన్సీడబ్ల్యూ సుమోటోగా స్వీకరించింది. మహిళా కమిషన్ బృందం గురువారం మేడారంలో పర్యటించి ఘటన జరిగిందని ఆరోపిస్తున్న ప్రాంతంలో పర్యటించి సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తి సమాచారాన్ని త్వరలో అందజేస్తామని వారు తెలిపారు.



# బాలకుమారస్వామికి మొక్కులు చెల్లించుకున్న మంత్రి సీతక్క





ములుగు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 05 (భారత శక్తి) : రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) పులుగు మండలం అంకన్న గూడెం గ్రామంలోని బాల కుమారస్వామి జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కలు చెల్లించుకున్నారు. ఆలయ మరమ్మతుల పనులకు పంచాయతీ రాజ్ శాఖ ద్వారా సుమారు 5 లక్షల రూపాయలతో పనులకు శంకుస్థాపన చేశారు .

అనంతరం మంత్రి మాట్లాడుతూ బాలకుమారస్వామి జాతరకు రావడం సంతోషంగా ఉందని గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తున్నామని ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు,సన్న బియ్యం, సీసీ రోడ్లు వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. బాలకుమారస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆయా ప్రాంతాల గ్రామ సర్పంచులు ఉప సర్పంచులు గ్రామస్థులు,మహిళలలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# 9వ వార్డులో ఇల్లు లేని పేద వాళ్లకు రెండో విడతలో ఇండ్లు ఇస్తాం

## -వార్డును అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాం
## -ఏఐసీసీ సభ్యులు- సర్వోత్తమ్ రెడ్డి
## -సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్- కొప్పుల వేణారెడ్డి

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)ఫిబ్రవరి 5:

సూర్యాపేట మున్సిపాలిటీ 9వ వార్డును అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామని వార్డులో ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ



పేరు మీద ఇల్లు కట్టించే ప్రక్రియ చేపడుతామని ఎఐసిసి సభ్యులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి బండారు మంగమ్మ వెంకన్న ఏర్పాటుచేసిన వార్డు ఎన్నికల పార్టీ కార్యాలయం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి తో కలిసిప్రారంభించిన అనంతరం పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అన్నారు. ఇచ్చిన అన్ని హామీలు అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందని తెలిపారు ఇప్పటికే ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. వార్డు అభ్యర్థి మంగమ్మ వెంకన్నను గెలిపించి వార్డు అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. అనంతరం లివ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూలి

వార్డులో ప్రతి ఓటరు చైతన్యవంతులు కావాలని దోచుకునే పార్టీ ఏదో ప్రజలకు సేవ చేసే పార్టీ ఏదో ఇకనైనా తెలుసుకోవాలని అన్నారు. వార్డులో కాంగ్రెస్ పార్టీ తరపున కౌన్సిలర్ అభ్యర్థిగా నిలబడిన బండారు మంగమ్మ వెంకన్నలను అత్యధిక మెజార్టీతో గెలిపించి వార్డులో ఇందిరమ్మ ఇండ్లను తెప్పించుకోవాలని తెలిపారు. గతంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో ఇందిరమ్మ పేరు మీద ఫేస్ 1 ఫేస్ టు ఫేస్ త్రి ఇందిరమైండ్లు కట్టించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే ఎట్టి పరిస్థితుల్లో చేసి తీరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కొండమల్ల శేఖర్, బంటు చొక్కయ,తలారి రాజు ఈదుల జానయ్య,నలగొండ నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

# యువతీ యువకులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 05 (భారతశక్తి): నిరుద్యోగులైన గిరిజన యువతీ, యువకులు వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. గురువారం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీలో గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ఎలక్ట్రానిక్ హార్డ్వేర్, డ్రోన్ సర్వీస్ ఎలక్ట్రీషియన్ శిక్షణ పొందుతున్న గిరిజన యువతి యువకులు శిక్షణ పూర్తవుతున్న సందర్భంగా ఐటీడీఏ కార్యాలయంలోని వివిధ విభాగాలలో గిరిజనులకు అందిస్తున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన యువతీ యువకులకు పలు సూచనలు ఇస్తూ, డ్రోన్ ఆపరేటర్, కంప్యూటర్ హార్డ్వేర్ ఎలక్ట్రానిక్, రిసెప్షన్ నిస్ట్ అసోసియేషన్ శిక్షణ తీసుకుంటున్న యువతి,యువకులు ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేస్తున్నప్పుడు ఎక్కువ శాతం ఇంగ్లీషులోనే మాట్లాడాలని సూచించారు. ఐటీడీఏలో ఉన్న విభాగాలు గిరిజన సంక్షేమం కోసమే పనిచేస్తున్నాయన్నారు. ముఖ్యంగా విద్యా, వైద్యం, గిరిజన గ్రామాలలో మౌలిక వసతుల కల్పన, గిరిజన రైతులకు వ్యవసాయంలో మెలకువలు, వారికి సబ్సిడీ ద్వారా కరెంటు, బోరు మోటర్లు, నిరుద్యోగ యువతీ యువకులకు పలు శిక్షణలు అందించి ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. 60 రోజులపాటు శిక్షణ తీసుకున్న యువతీ యువకులు తప్పనిసరిగా ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసి అనుకున్న ఉద్యోగం వచ్చేవరకు కుటుంబాలను పోషించుకోవాలన్నారు. మీరు నేర్చుకున్నది పదిమంది గిరిజన యువతి యువకులకు తెలిసే విధంగా చేసి వారు కూడా ఇటువంటి శిక్షణలు తీసుకొని ఉద్యోగ అవకాశాలు పొందేలా కృషి చేయాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, జేడీఎం హరికృష్ణ, వివిధ కోర్సుల శిక్షకులు శ్రీనివాస్, అరుణ, సులోచన, అబ్దుల్, భవాని, అనూహ్య, వినీత, సమ్మయ్య యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాలెట్ పేపర్ల ముద్రణ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 05 (భారతశక్తి) మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి, బ్యాలెట్ పేపర్ల ముద్రణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.



గురువారం పట్టణంలోని ఆదర్శనగర్ లో గల విజయ్ ఆఫ్ సెట్ ప్రింటింగ్ ప్రెస్ లో, మున్సిపల్ ఎన్నికల బ్యాలెట్ పేపర్ల ముద్రణ ప్రక్రియను, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి అవసరమైనన్ని బ్యాలెట్ పేపర్లను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్ల ముద్రణలో ఎటువంటి లోపాలు తలెత్తకూడదని పేర్కొన్నారు. అనధికార వ్యక్తులను ఎవరిని ముద్రణ కేంద్రంలోకి అనుమతించకూడదని చెప్పారు. ముద్రణ ప్రక్రియ మొత్తం పూర్తయ్యేంతవరకు పటిష్ట పోలీసు బందోబస్తు కొనసాగించాలని వివరించారు. బ్యాలెట్ పేపర్ ముద్రణ విధులు కేటాయించిన సిబ్బంది, ముద్రణ తీరును మొత్తం క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, జెడ్పీ సీఈవో శంకర్, ఉద్యానవన పంటల అధికారి రమణ, తహసిల్దార్ రాజు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల జయనగర్, కడప లో సీబీసీ ఆధ్వర్యంలో ఘనంగా '150 సంవత్సరాల వందేమాతర గీతం పై అవగాహనా కార్యక్రమం'



కడప, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 5: కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి), కడప క్షేత్ర కార్యాలయం ఆధ్వర్యంలో గురువారం రోజున '150 సంవత్సరాల వందేమాతర గీతం' పై ' అవగాహనా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కడపలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులు, బోధన సిబ్బంది వందేమాతర గీతం ఆలాపనలో పాల్గొన్నారు.

సదస్సులో కడప సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సిబిసి) ప్రతినిధి పి.హరికృష్ణ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వందేమాతరం గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం కడపలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, కులమత ప్రాంత భాషలకు అతీతంగా వందేమాతర ఉద్యమం కొనసాగిందని ఆయన అన్నారు. మహాత్మా గాంధీ అల్లూరి సీతారామరాజు, సుభాష్ చంద్రబోస్, భగత్ సింగ్ ప్రతి ఒక్కరూ వందేమాతరాన్ని స్ఫూర్తిగా తీసుకొని నాటి స్వతంత్ర పోరాటాన్ని కొన సాగించారు అని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు చిన్నతనం నుంచి వందేమాతరం, జనగణమన గీతాలు నేర్పించడంతోపాటు వాటి అర్థాన్ని తెలియజేయాలని అది జాతి సమైక్యతకు స్వాతంత్ర పోరాట స్ఫూర్తిని తెలియజేస్తాయని అని ఆయన అన్నారు. 450 మంది విద్యార్థులు వందేమాతర గీతాన్ని ముక్త కంఠంతో ఆలపించారు. ఈ కార్యక్రమంలో 10వ వార్డు కార్పొరేటర్ యమ్ మల్లికార్జున, ప్రధానోపాధ్యాయురాలు యు భాగ్యవతి, విద్యార్థులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి కేయూ పాలకమండలి మాజీ సభ్యుడు వి. సత్యనారాయణ గౌడ్.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 05 (భారత శక్తి)ఉన్నత చదువులతో పాటు నైతిక విలువలు పెంపొందించుకొని విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కాకతీయ విశ్వవిద్యాలయ పాలకమండలి మాజీ సభ్యుడు, కళాశాల డైరెక్టర్ వి. సత్యనారాయణ గౌడ్ పిలుపునిచ్చారు.



గురువారం బైంసా పట్టణంలోని వశిష్ట జూనియర్ కళాశాల 16వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు దృఢ సంకల్పం, అంకితభావంతో లక్ష్యసాధన దిశగా ముందుకు సాగాలని సూచించారు. ఇంటర్మీడియట్ విద్య భవిష్యత్తుకు బలమైన పునాదిగా మారుతుందని, ఈ దశను సమర్థవంతంగా పూర్తి చేస్తే ఉన్నత చదువులకు మార్గం సుగమమవుతుందని అన్నారు.

పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే వార్తాపత్రికల పఠనం, జనరల్ నాలెడ్జ్, ఇంగ్లీష్‌పై పట్టుసాధించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి ఫీజులు చెల్లిస్తూ పిల్లల భవిష్యత్తు కోసం కలలు కంటున్నారని, ఆ కలలను నిజం చేయడమే విద్యార్థుల బాధ్యత అని స్పష్టం చేశారు.

దురలవాట్లకు దూరంగా ఉండి, దేశభక్తిని పెంపొందించుకొని, క్రమశిక్షణతో సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆయన ఉద్బోధించారు. ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే వార్షిక పరీక్షల్లో కష్టపడి చదివి ఉత్తమ మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వెంకటేష్, మోటివేషన్ స్పీకర్ లక్ష్మణ్, ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు భూషణ్ పాండే, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సంజీవ్, పండరి, డాక్టర్ విజయనందు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఐఐటి హైదరాబాద్ క్యాంపస్ లో భారత శక్తి దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 5:



భారత శక్తి దినపత్రిక 2026 క్యాలెండర్ ను సంగారెడ్డి జిల్లా కంది మండలంలోని ఐఐటి హైదరాబాద్ క్యాంపస్ పిఆర్వో వినయ్ కుమార్ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో భారత శక్తి దినపత్రిక కథనాలు అభినందనీయమని ప్రశంసించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య పత్రికలు వారధులుగా ఉంటాయన్నారు. క్యాంపస్ సంబంధించిన సమగ్ర విద్య సంబంధిత సమాచారాలను ఎప్పటికప్పుడు పత్రికలో ప్రచురిస్తూ వెన్ను దన్నుగా నిలుస్తున్న యాజమాన్యానికి, జర్నలిస్టులకు ఆయన క్యాంపస్ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భారత శక్తి జిల్లా స్టాపర్ శ్రీకాంత్, పిఆర్ఓ ఆఫీస్ ఉద్యోగులు ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్ నీరజ, ప్రాజెక్ట్ అసిస్టెంట్ మంజుల, ఫోటోగ్రాఫర్ పుష్పంధర్ తదితరులు పాల్గొన్నారు.

# 6 వార్డులో కాంగ్రెస్ ప్రచారానికి జోష్

## - నవాజ్ కు లభిస్తున్న ప్రజా ఆదరణ
## - గడపగడపకు కాంగ్రెస్ ప్రచారం



సంగారెడ్డి,భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 5:

సంగారెడ్డి పట్టణంలోని 6 వ వార్డులో కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థి నవాజ్ కి వార్డు ప్రజల నుంచి విశేషమైన స్పందన లభిస్తోంది. 6వ వార్డులో గత కొన్నేళ్లుగా అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వార్డు అభివృద్ధిపై నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. ప్రస్తుతం వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ ప్రభుత్వ ద్వారానే సాధ్యమవుతున్నాయని తెలిపారు. 6వ వార్డు ప్రజలు నవాజ్ ని కౌన్సిలర్‌గా గెలిపిస్తే, వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ లక్ష్యమని అన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

# కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం కదిలిన జగ్గారెడ్డి కుటుంబం

## - సదాశివపేట లో జగ్గారెడ్డి సుడిగాలి పర్యటన
## - సంగారెడ్డి పట్టణం లో ప్రత్యేక ఆకర్షణ గా జయాచైతన్య రెడ్డి ఇంటింటి ప్రచారం
## - సంగారెడ్డి లో సభలు, సమావేశాలు, చేరికలు, ఇంటింటి ప్రచారం తో హోరెత్తించిన టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి


సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 5:

మున్సిపల్ ఎన్నికలకు కొన్ని రోజులే మిగిలి ఉండటం తో సంగారెడ్డి, సదాశివపేట నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ తన ప్రచార వేగాన్ని పెంచింది. జగ్గారెడ్డి కూతురు జయాచైతన్య రెడ్డి, సంగారెడ్డి డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సంగారెడ్డి పట్టణంలో ఇంటింటి ప్రచారం లో పాల్గొన్నారు. జయాచైతన్య రెడ్డి సంగారెడ్డి పట్టణం లోని 21,19,29,8,27 వ వార్డులలో ప్రచారం నిర్వహించారు. ఇల్లుల్లు తిరుగుతూ, అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ జయాచైతన్య రెడ్డి అందరినీ ఆకర్షించారు. ప్రచారం సందర్భంగా జయా రెడ్డి కి ప్రజలు తమ సమస్యలను వివరించారు. మీకు జగ్గారెడ్డి ఉన్నారు, ధైర్యంగా ఉండండి అంటూ ప్రజలకు భరోసా కల్పించారు. రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, సంగారెడ్డి పట్టణం అభివృద్ధి లో ముందుకు సాగాలి అంటే కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డిసిసి అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి సంగారెడ్డి పట్టణం లోని 24,25,26,05,38 వ వార్డులలో ఇంటిటి ప్రచారం నిర్వహించారు. సంగారెడ్డి మున్సిపాలిటీ లోని 38 వార్డులలో అన్ని చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని, జగ్గారెడ్డి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి తో మాట్లాడి పట్టణానికి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి సంగారెడ్డి పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతారని తెలిపారు. రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించి కాంగ్రెస్ పార్టీకి ఓటేసి అభ్యర్థులను భారీ మెజారిటీ తో గెలిపించాలన్నారు. సదాశివపేట లో జగ్గారెడ్డి సుడిగాలి పర్యటన: సదాశివపేట లో టీ పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. సదాశివపేట శంభు లింగేశ్వర ఆలయం మొదలుకుని దుర్గమ్మ గుడి , గాంధీ చౌక్ , శాస్త్రి రోడ్ , బస్టాండ్ , సుభాష్ రోడ్ , తిలక్ రోడ్



గుండా పాదయాత్రగా తిరుగుతూ సందడి చేశారు. వ్యాపారులను,ప్రజలను పలకరిస్తూ ముందుకు సాగారు. గాంధీ చౌక్ లో ఒక దుకాణం లో కూర్చుని కాంగ్రెస్ నాయకులు, పట్టణ ప్రజల తో సమావేశం అయ్యారు. చాయ్ తాగుతూ కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి స్థానిక కాంగ్రెస్ నాయకులకు పలు సూచనలు చేశారు. సదాశివపేట పట్టణం లోని 26 వార్డులలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. అలా గెలిపించుకుంటే సీఎం రేవంత్ రెడ్డి వద్దకు వెళ్లి నిధులు తీసుకువచ్చి సదాశివపేట పట్టణాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఎన్నికల్లో గెలుపే ముఖ్యమని, గెలిచి తనవద్దకు రావాలన్నారు. ఈ పర్యటన లో జగ్గారెడ్డి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రామ్ రెడ్డి, స్థానిక నాయకులు, చిరు, కంది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఓరుగల్లు ఒక ఆధ్యాత్మిక కేంద్రం




ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)ఫిబ్రవరి5:

ఓరుగల్లు వైభవాన్ని చాటే విధంగా, శివతత్వాన్ని చాటే విధంగా ప్రతీ ఏటా ఏనుగుల రాకేష్ రెడ్డి సారథ్యం ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హన్మకొండ, హయగ్రీవ చారి గ్రౌండ్స్ లో నిర్వహిస్తున్న మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం కార్యక్రమ కరపత్రికను గురువారం హరిత హోటల్ లో శ్రీ భద్రకాళి ఆలయ ప్రధాన అర్చకులు, బ్రహ్మశ్రీ శేషు అయ్యగారు, ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ వరంగల్ జిల్లా అధ్యక్షులు జైపాల్ రెడ్డి సమక్షంలో విడుదల చేశారు.

శేషు మాట్లాడుతూ ఓరుగల్లు ఒక ఆధ్యాత్మిక కేంద్రం, ఇక్కడ ఒకటే నగరంలో పంచాత్మక లింగాలు ఉన్నాయని ఈ విశిష్ఠత దేశం మొత్తంలో ఒక ఓరుగల్లుకు మాత్రమే ఉ ంది. ఓరుగల్లు లో పుట్టిన ప్రతీ బిడ్డలో ఏదో ఒక ప్రాధాన్యత ఉంటుంది. అది ఈ మట్టిలో పుట్టిన ప్రతీ బిడ్డకు సహజ సిద్ధంగా లభిస్తుంది. ఈ విశిష్ఠతను ప్రపంచానికి చాటి చెప్పడం కోసం ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాకేష్ రెడ్డి చేస్తున్న ఈ ప్రయత్నం దిగ్విజయంగా సాగడానికి ఆ అమ్మవారి ఆశీస్సులు ఉంటాయి. అందరి సహకారం కూడా తొడవ్వాలని పిలుపునిచ్చారు.

ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ఓరుగల్లు ఒక ఆధ్యాత్మిక సాంస్కృతిక కేంద్రం, ఇక్కడ ఎన్నో కళలు ఫరీడవిల్లాయి. దాశరథి, కాళోజీ లాంటి కవులెంధరో పుట్టిన నేల ఇది. 400 ఏళ్లపాటు కాకతీయ రాజదానిగా విలసిల్లిన ఈ నగరం శివతత్వానికి కేంద్రం. కాబట్టి, ఈ ప్రాంత విశిష్ఠతను చాటి చెప్పడం కోసం ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం గత 6 ఏళ్లుగా నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమం కేవలం ఇండస్ ఫౌండేషన్ శివరాత్రి కార్యక్రమం కాదని, ఇది ఓరుగల్లు ఉత్సవం, కాకతీయుల ఉత్సవంగా మారిందని, ప్రజలంతా ఇది మన ఉ త్సవం అని అక్కున చేరుకున్నారని అన్నారు.

ప్రతీ ఏడాది లాగే అనేక ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా రూపాలతో కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

శివపార్వతీ కళ్యాణంతో సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది.

రాధామణోహర్ దాస్ ప్రవచనం

పద్మశ్రీ కిన్నెర మిగిలయ్య కిన్నెర కళారూప ప్రదర్శన

దేశపతి శ్రీనివాస్ సాహిత్య కళా వైభవ సందేశం

ఆర్పి పట్నాయక్, స్వరాభిషేకం

శశిధర శర్మ శాస్త్రీయ సంగీతం, నల్గొండ గద్దర్, కాసర్ల శ్యామ్, కొదారి శ్రీనివాస్, జానపద జాతర తో పాటు

లింగోద్భవ సమయంలో సప్తహారతీ

పేరణీ శివతాండవం తో పాటు ప్రతీ ఏడాది లాగే ఆధ్యాత్మిక, సాంస్కృతిక, కళా, సేవా, పర్యావరణ, ఇత్యాది రంగాల్లో నిస్వార్థ సేవలందించిన ఉత్తములకు కాకతీయ పురస్కారం కూడా ప్రధానం చేస్తామని తెలిపారు. కావున ఓరుగల్లు ప్రజలంతా ఈ నెల 15 న ఇండస్ ఫౌండేషన్ మహా శివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనంలో పాల్గొని తరించాలని ఆహ్వానించారు.


విశ్వహిందూ పరిషత్ వరంగల్ జిల్లా అధ్యక్షులు జైపాల్ రెడ్డి మాట్లాడుతూ ఓరుగల్లులో ఎక్కడ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, హిందుత్వ వేడుకలు జరిగినా విశ్వహిందూ పరిషత్ మద్దతుగా నిలుస్తుందని అన్నారు.

భారత దేశం సనాతన ధర్మానికి పుట్టినిల్లు, అందులో మన ఓరుగల్లు శివరత్వానికి ఆధ్యాత్మికతకు పేరుగాంచింది. మన ఓరుగల్లులో ఎక్కడ తవ్వినా శివ లింగాలు బయటపడతాయి. అంతటి విశిష్ఠత గలది మన ప్రాంతం.

ఆ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు చేరవేయడానికి ఇండస్ ఫౌండేషన్ చేస్తున్న ప్రయత్నం అభినందనీయం. ఇలాగే ఇంకెన్నో ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఆర్జిల్లా కార్యదర్శి ఎలగందుల రాజు, కార్పొరేటర్ రవి నాయక్, ప్రముఖ యోగ గురువు పోషాల శ్రీనివాస్, ఇండస్ ఫౌండేషన్ కార్యదర్శి పురుషోత్తం యాదవ్, మహాశివరాత్రి కార్యక్రమ నిర్వాహకులు కత్తుల అభిషేక్, సుకాంత్, దీపక్, అఖిల్ రెడ్డి, అయినవోలు సర్పంచ్ గడ్డం రఘువంశి, సోమదేవరపల్లి సర్పంచ్ కృష్ణమూర్తి, కొమురయ్య, కొడారి రవి, సుమన్ గౌడ్, గువ్వ రాజేష్, రవీందర్ రెడ్డి, కార్తీక్ రెడ్డి, వంశీ, రాజేందర్, పిన్నింటి విజయ్, వైనాల నరేష్, బోడ విజయ్, లక్ష్మణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


# సినిమా




## సీక్వెల్‌పై క్లారిటీ

రణ్‌బీర్ కపూర్ హీరోగా సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కించిన యానిమల్ మూవీ ఎంతటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. 2023 డిసెంబర్‌లో రిలీజై బాక్సాఫీస్ వద్ద దాదాపు 918 కోట్లు వసూలు చేసి ఆ ఏడాది అత్యుత్తమ చిత్రంగా రికార్డులు బ్రేక్ చేసింది. దీంతో ఈ మూవీకి సీక్వెల్‌గా యానిమల్ పార్క్ ఉంటుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఈ నెల 13న యానిమల్ సినిమా జపాన్‌లో రిలీజ్ కానున్న నేపథ్యంలో ప్రమోషన్స్‌లో భాగంగా జపాన్ అభిమానులతో మాట్లాడిన సందీప్‌రెడ్డి వంగా 2027లో షూటింగ్ ప్రారంభిస్తామని ప్రకటించాడు. అంతే కాదు 2028లో విడుదల చేస్తామని కూడా క్లారిటీ ఇచ్చేశారు. ఇందులో రణ్‌బీర్ హీరోగా, విలన్‌గా నటించనున్నారని తెలిపాడు. ఈ సీక్వెల్ మొదటి భాగం కంటే మరింత దూకుడుగా ఉంటుందని, ప్రస్తుత ప్రాజెక్ట్ స్పిరిట్ పూర్తి చేసిన తర్వాత ఈ చిత్రం ప్రారంభమవుతుందని వెల్లడించాడు.

## భార్య గెంటేసింది



మణిరత్నం దర్శకత్వంలో వచ్చిన అలై పాయుతే తమిళ సినిమాతో వెండితెరకు పరిచయమైన ఆర్. మాధవన్.. నటుడు, రచయిత, నిర్మాత, టెలివిజన్ ప్రోగ్రామ్ హోస్ట్ గా బిజీగా ఉంటాడు. అలాంటి బిజీ జీవితం గడిపే వ్యక్తి కోవిడ్ సమయంలో ఇంట్లో భార్యకు ఖాళీగా కనిపించాడట. ఆయన గురించి పూర్తిగా తెలిసిన భార్య సరిత తనను ఇలా ఖాళీగా ఉండడం ఎప్పుడూ చూడలేదని చెప్పిందట. కామెడీ, యాక్షన్ సినిమాలు, ఓటీటీ.. ఇలా ఏదో ఒక ప్రాజెక్టుల నటిస్తూనే ఉండే తాను ఇంట్లోనే ఉండటం భార్యకు ఆశ్చర్యం కలిగించిందట. దీంతో ఎప్పటిలానే బయటకు వెళ్లి డబ్బులు సంపాదించు అని చెప్పింద. ఆమె చెప్పిన ఆ మాటలు తనలో ఆలోచనను కలిగించాయన్నాడు నటుడు మాధవన్. అయితే ఆయన ఈ విషయాన్ని సరదాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు. 'నా భార్య కొవిడ్ సమయంలో డబ్బు సంపాదించమని నన్ను గెంటేసింది' అని ఆయన చేసిన కామెంట్స్ ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ గా మారాయి.

## ఓటీటీలో మెగా సినిమా

చిరంజీవి, వెంకటేశ్ కాంబోలో వచ్చిన సినిమా 'మనశంకర వరప్రసాద్‌గారు'. గత నెల 12న థియేటర్లలోకి వచ్చిన ఈ మూవీ సూపర్ హిట్‌గా నిలిచింది. నయనతార హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో.. వెంకటేశ్ కీలకపాత్రలో మెప్పించారు. ప్రస్తుతం ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ మూవీ కోసం ఓటీటీ రైట్స్‌ను జీ5 సొంతం చేసుకుంది. ఈనెల 11 నుంచే ఓటీటీకి రానుందని తెలుస్తోంది. తాజాగా జీ5 తమ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ అయ్యే సినిమాల జాబితాను రివీల్ చేసింది. ఇందులో మన శంకర వరప్రసాద్‌గారు ఫిబ్రవరి 11న స్ట్రీమింగ్‌కు రానుందని తెలిపింది. ఈ ప్రకటనతో టాలీవుడ్ సినీ ప్రియులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.



## నా భార్య ఇంటి నుంచి గెంటేసింది: సరదా విషయం పంచుకున్న మాధవన్

కొవిడ్ సమయంలో తన ఇంట్లో జరిగిన ఒక విషయాన్ని నటుడు మాధవన్ తాజాగా గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో తాను ఇంట్లో ఉండడం చూసి భార్య సరిత ఇంట్లో నుంచి బయటకు గెంటేసిందంటూ సరదాగా చెప్పారు. ప్రస్తుతం వరుస సినిమాలతో అలరిస్తున్న ఆయన ఓ ఆంగ్ల మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో ఈ విషయాన్ని పంచుకున్నారు. ''కొవిడ్ సమయంలో ఇంట్లో ఖాళీగా ఉన్నాను. అప్పుడు నా భార్య వచ్చి.. 'నువ్వు ఇలా ఖాళీగా ఉండడం ఎప్పుడూ చూడలేదు. ఏదో వర్క్ చేస్తూనే ఉంటావు. కామెడీ, యాక్షన్ సినిమాలు, ఓటీటీ ఏదో ఒక ప్రాజెక్ట్‌లో నటిస్తూనే ఉంటావు. ఇప్పుడు ఇంట్లోనే ఉంటున్నావంటే నాకు ఆశ్చర్యంగా ఉంది. గతంలో ఉన్నంత ఉత్సాహంగా కనిపించడం లేదు. వర్క్‌కు వెళ్లినా



త్వరగా ఇంటికి వచ్చేస్తున్నావు. నువ్వు బాగానే ఉన్నావా. ఎప్పటిలానే బయటకు వెళ్లి, డబ్బులు సంపాదించు.' అని చెప్పింది. ఆ మాటలు నాలో ఆలోచనను కలిగించాయి. నన్ను నేను పరిశీలించుకున్నా'' అని మాధవన్ చెప్పారు. అయితే ఆయన ఈ విషయాన్ని సరదాగా వెల్లడించారు. 'నా భార్య కొవిడ్ సమయంలో డబ్బు సంపాదించమని నన్ను గెంటేసింది' అని చెప్పడంతో ఈ కామెంట్స్ వైరల్‌గా మారాయి. ఇటీవల మాధవన్ తన కెరీర్‌లో విరామం తీసుకోవడం గురించి మాట్లాడారు. 2011 నుంచి 2015 వరకూ విరామం తీసుకున్న ఆయన 2016లో 'సాలా ఖదూస్'తో తిరిగి అలరించడం ప్రారంభించారు. పనిపై ఆసక్తి తగ్గడంతో నాలుగేళ్లు విరామం తీసుకున్నట్లు వివరించారు.

## మరో ఘటన జరగకముందే జాగ్రత్త పడండి

**: సోనూసూద్**



ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో ఆన్‌లైన్ గేమింగ్ కారణంగా ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకున్న ఘటన దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన విషయం తెలిసిందే. దీనిపై నటుడు సోనూసూద్ ఆందోళన వ్యక్తంచేశారు. 16 ఏళ్లలోపు పిల్లలకు ఆన్‌లైన్ గేమింగ్‌పై ఆంక్షలు విధించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ''16 ఏళ్లలోపు పిల్లలను సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమింగ్‌లకు సాధ్యమైనంతవరకూ దూరంగా ఉంచాలి. గాజియాబాద్‌లో ముగ్గురు పిల్లలు ఈ వ్యసనం కారణంగా ప్రాణాలు కోల్పోయారు. హింస, పేదరికం వల్ల వాళ్లు చనిపోలేదు.. ఆన్‌లైన్ గేమింగ్, డిజిటల్ వ్యసనం కారణంగా కనిపించని ఒత్తిడి వల్ల వాళ్లు మరణించారు. నేను గతంలో కూడా దీనిపై పోరాటం చేశాను. ఇప్పుడు మళ్లీ చెబుతున్నాను.. దయచేసి పిల్లలను సోషల్‌మీడియాకు దూరంగా ఉంచండి. మరోసారి ఇలాంటి ఘటన జరగకముందే జాగ్రత్తలు తీసుకోండి'' అని సోనూసూద్ అన్నారు.


## ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో అనురాగ్ కశ్యప్ పేరు?

**: స్పందించిన దర్శకుడు**



ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో అనురాగ్ కశ్యప్ పేరు ఉందంటూ ప్రచారం జరుగుతోంది. ఎప్‌స్టీన్‌కు సంబంధించిన ఓ ఈవెంట్ కోసం అనురాగ్ 2017లో బీజింగ్ వెళ్లారంటూ రూమర్స్ వచ్చాయి. వీటిపై దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ స్పందించారు. ఓ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. వాటిని ఖండించారు. ''వక్తగా నాకు నెలకు దాదాపు 15 ఆహ్వానాలు వస్తుంటాయి. అరుదుగా వాటిపై స్పందిస్తుంటా. నా జీవితంలో ఇప్పటి వరకూ బీజింగ్ వెళ్లలేదు'' అని పేర్కొన్నారు. తన సినిమాల కన్నా తన పేరుతో కూడిన ప్రచారంపై ఆసక్తి చూపించడాన్ని తప్పుబట్టారు. బాలీవుడ్‌కు చెందిన ఇతర దర్శక నిర్మాతలు, నటీనటుల పేర్లు కూడా ఉన్నట్లు వార్తలు రావడం చర్చనీయాంశమవుతోంది.

## మార్చిలో ఉస్తాద్... ఏప్రిల్‌లో పెద్ది




మొదట బాబాయ్ సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'... ఆ తర్వాత అబ్బాయ్ సినిమా 'పెద్ది'... వరుస నెలల్లో థియేటర్లలో సందడి చేయనున్నాయి. ఈ రెండు సినిమాల విడుదల తేదీలు బుధవారం అధికారికంగా ఖరారయ్యాయి. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా.. హరీశ్‌శంకర్ తెరకెక్కిస్తోన్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' మార్చి 26న ప్రేక్షకుల ముందుకు రానుంది. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రమిది. దేవిశ్రీప్రసాద్ స్వరాలు సమకూర్చుతున్నారు. ఇప్పటికే చిత్రీకరణని పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం నిర్మాణానంతర పనుల్ని చేసుకుంటోంది. 'గబ్బర్‌సింగ్' తర్వాత పవన్‌కల్యాణ్ హరీశ్ కలయికలో రూపొందుతున్న చిత్రమిది. మార్చి 26న అసలు సిసలైన పవర్‌స్టార్ వేడుకకు సిద్ధంగా ఉండండంటూ అభిమానులకు పిలుపునిచ్చింది చిత్రబృందం. ఇక 'పెద్ది' విషయానికొస్తే... మొదట ఈ సినిమాని మార్చిలోనే విడుదల చేయాలనుకున్నారు. అయితే చిత్రీకరణతోపాటు, నిర్మాణానంతర పనులకు మరికొంత సమయం అవసరం కావడంతో, ఏప్రిల్ 30న విడుదల చేయాలని సినీ వర్గాలు నిర్ణయించాయి. బుధవారం కొత్త తేదీని అధికారికంగా ప్రకటించాయి. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో.. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్న చిత్రమిది. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సమర్పిస్తున్నాయి. ఇందులో రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ స్వరకర్త. 'పెద్ది' వచ్చే తేదీ మారిందేమో కానీ అతని పట్టుదల ఎప్పటికీ మారదని చిత్ర బృందం తెలిపింది.



## కలెక్టర్, అబ్జర్వర్ సమక్షంలో
# పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

సంగారెడ్డి, ఫిబ్రవరి 5 (భారత శక్తి) : మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య, జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్ సమక్షంలో గురువారం నిర్వహించారు. కలెక్టర్ ఛాంబర్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్న సంగారెడ్డి, సదాశివపేట, కోహిర్, జహీరాబాద్, నారాయణఖేడ్, ఆందోల్ జోగిపేట్, ఇస్నాపూర్, ఇంద్రేశం, గుమ్మడిదల, గడ్డపోతారం, జిన్నారం మున్సిపాలిటీలకు సంబంధించి ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, డిఇఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



## గోకుల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

**: హాస్పిటల్ ఎండి డాక్టర్ శ్రీహరి**

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 5: సంగారెడ్డి గోకుల్ వెంకటేశ్వర సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండి డాక్టర్ శ్రీహరి నేతృత్వంలో మోమినిపేట మండలం మోరంగపల్లి గ్రామం శివాలయంలో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో శివ స్వాములకు కండువాలతో సత్కారం, అల్పాహారం అందించారు. గోకుల్ హాస్పిటల్ నూతన సంవత్సర క్యాలెండర్ శివ స్వాముల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

## మున్సిపల్ ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి

**: జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల**



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 05 (భారతశక్తి) మున్సిపల్ ఎన్నికలను పూర్తిగా పారదర్శకంగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా పోలీసు శాఖ పూర్తి సన్నద్ధంగా ఉందని జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల తెలిపారు.ప్రజలు ఎలాంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

*** ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ...**

మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి భద్రతా చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, సున్నిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి అక్కడ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో గొడవలు, ఘర్షణలకు ఆస్కారం లేకుండా ముందస్తుగా రౌడీ షీటర్లు, పాత నేరస్తులు, అసాంఘిక శక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని, అవసరమైన చోట బైండోవర్ కేసులు నమోదు చేసి, ఆయుధాల అప్పగింత (వెపన్స్ డిపాజిట్) ప్రక్రియను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సమయంలో మద్యం, నగదు, ఇతర విలువైన వస్తువుల పంపిణీ ద్వారా ఓటర్లను ప్రలోభపెట్టే చర్యలను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ తరహా అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెక్‌పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు నిర్వహించి, అక్రమ నగదు, మద్యం రవాణాను అడ్డుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు ఉండాలని, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఎన్నికల కోడ్‌ను కచ్చితంగా అమలు చేయాలని, కోడ్ ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అన్ని పోలీస్ విభాగాలు సమన్వయంతో పనిచేసి జిల్లాలో శాంతి భద్రతలు కాపాడాలని స్పష్టం చేశారు.

## ఇంటింటి ప్రచారంలో 4 వార్డు కౌన్సిలర్
# బిఆర్ఎస్ అభ్యర్థి కసిని శ్రీకాంత్


సంగారెడ్డి, ఫిబ్రవరి 5 (భారత శక్తి ప్రతినిధి) : సంగారెడ్డి మున్సిపాలిటీలో ఎన్నికల హడావుడి ఊపందుకుంది. మున్సిపాలిటీలోని 4వ వార్డు బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి కసిని శ్రీకాంత్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 4వ వార్డు అభివృద్ధి చేసి చూపిస్తానని ఓటర్లకు వివరించారు. వార్డు అభివృద్ధికి స్వచ్ఛందంగా కృషి చేస్తానని అన్నారు. కాలనీవాసులో తన ప్రచారానికి సహకరిస్తున్నట్లు తెలిపారు.కారు గుర్తుకు ఓటు వేసి అభివృద్ధికి చేయూతనివ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు,



కార్యకర్తలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# రానున్నది బిఆర్ఎస్ ప్రభుత్వమే

**- ఎమ్మెల్యే చింత ప్రభాకర్**



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 5 : బిఆర్ఎస్ పార్టీతోనే పట్టణాల అభివృద్ధి సాధ్యమని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని 20, 21 వార్డుల బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా పట్టణ రజక సంఘం అధ్యక్షులు శివరాజ్ బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే చింత ప్రభాకర్ పార్టీ కండువా కప్పి వారికి ఘనంగా స్వాగతం పలికారు. అలవి కానీ హామీలతో ప్రజలను మభ్యపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి మున్సిపల్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. రెండు సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమి లేదని విమర్శించారు. మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆయా వార్డుల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు

**: ఆదివాసీ కాంగ్రెస్ నిర్మల్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్.**



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 05 (భారత శక్తి) రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని, కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ నిర్మల్ జిల్లా చైర్మన్ బాణావత్ గోవింద్ నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పార్టీని జిల్లాలో సమర్థవంతంగా నడిపిస్తున్నారని ఆయన ప్రశంసించారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తుండటంతో ప్రజల్లో పార్టీపై విశేష ఆదరణ పెరిగిందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు ప్రజలు మద్దతుగా నిలుస్తున్నారని, అదే క్రమంలో మున్సిపల్ ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను తిరస్కరిస్తూ కాంగ్రెస్‌కు ఓటుతో పట్టం కట్టనున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# 12 వార్డులో బీజేపీ ప్రచారానికి జోష్

- * సాహితీ రాముకు లభిస్తున్న ప్రజా ఆదరణ
- * గడపగడపకు బీజేపీ ప్రచారం



సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 5: సంగారెడ్డి పట్టణంలోని 12వ వార్డులో బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి రాము సాహితీకి వార్డు ప్రజల నుంచి విశేషమైన స్పందన లభిస్తోంది. రాము సాహితీకి మద్దతుగా సంగారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా గోదావరి అంజిరెడ్డి మాట్లాడుతూ, 12వ వార్డులో గత కొన్నేళ్లుగా అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాలు గతంలో వార్డు అభివృద్ధిపై నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. ప్రస్తుతం వార్డులో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారానే సాధ్యమవుతున్నాయని తెలిపారు.12వ వార్డు ప్రజలు రాము సాహితీని కౌన్సిలర్‌గా గెలిపిస్తే, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు ఎంపీ, ఎమ్మెల్సీ నిధులను వినియోగించి వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే బీజేపీ లక్ష్యమని అన్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాము సాహితీకి తమ మద్దతు తెలిపారు.

## శ్రీ నీలకంఠేశ్వర స్వామి వారి కళ్యాణ మహోత్సవం వాల్ పోస్టర్ ఆవిష్కరణ



మణుగూరు, ఫిబ్రవరి 05 (భారతశక్తి): ఈ నెల 15న జరిగే మహాశివరాత్రి పురస్కరించుకుని శ్రీశ్రీశ్రీ నీలకంఠేశ్వర స్వామి, నీల సుందరీదేవి సతీసమేతంగా కన్నుల పండువగా జరిగే కళ్యాణ మహోత్సవమును విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దేవాదాయ ధర్మాదాయ శాఖ దేవస్థానం ఆలయ నిర్వహణ అధికారి ఎన్ శేషయ్య కోరారు. గురువారం పట్టణంలోని పాత మణుగూరులో స్వయంబుగా వెలసిన శ్రీ నీలకంఠేశ్వర స్వామి వారి దేవస్థానము ఈఓ ఎన్ శేషయ్య ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో వాల్ పోస్టర్లు, పాంప్లెట్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14 శనివారం (స్థిరవారం) నుండి 16 సోమవారం వరకు మహాశివరాత్రి మహోత్సవములు అత్యంత వైభవంగా జరుగుతాయని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి, అనంతరం ద్వీ లింగాలను దర్శనం చేసుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అద్దంకి నరేష్, డిప్యూటీ తహశీల్దార్ కారం రామారావు, శ్రీవిద్య విద్యా సంస్థల డైరెక్టర్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, మల్లిడి లాలయ్య, మల్లిడి భాస్కర్, ఆలయ సిబ్బంది శ్రీనివాస రాజు, శ్రీను, ఆలయ అర్చకులు, మాజీ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి ధర్మం చాటుకున్న పోలీసులు

- * పోయిందనకున్న బ్యాగ్ దొరికింది..
- * కృతజ్ఞతలు తెలిపిన మహిళ



జగద్గిరిగుట్ట, భారత శక్తి ప్రతినిధి, ఫిబ్రవరి 5: కూకట్‌పల్లి ప్రభుత్వ కళాశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న మహిళ, అధికారిక కార్యక్రమంలో భాగంగా జగద్గిరిగుట్ట పరిధిలోని గాంధీ హైట్స్ వద్ద స్కూటీపై ప్రయాణిస్తున్న సమయంలో ఆమె తన హ్యాండ్ బ్యాగును పోగొట్టుకున్నారు. బ్యాగులో మొబైల్ ఫోన్ ఉండడంతో ఎవరైనా యూపీఐ ద్వారా అకౌంట్‌లోని నగదు విత్ డ్రా చేస్తారేమో అని ఆందోళన చెందారు. ఇదే విషయమై ఆమె జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వెంటనే స్పందించిన జగద్గిరిగుట్ట క్రైమ్ విభాగం పోలీసులు డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి. నరేందర్ రెడ్డి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తక్కువ సమయంలోనే తన బ్యాగును గుర్తించి, బాధితురాలికి అప్పగించారు. అయితే బ్యాగ్ లోని మొబైల్ ఫోన్ తో సహా.. తన అకౌంట్‌లో నగదుతో పాటు ఇతర విలువైన వస్తువులన్నీ సురక్షితంగా ఉండటంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన జగద్గిరిగుట్ట పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

# బిల్డ్ నౌ'.. అవినీతికి 'బైపాస్' రోడ్డు!




- జి.హెచ్.ఎం.సి సర్కిల్ 12 ఎల్.బి. నగర్ లో అధికారుల కక్కుర్తి.. నిబంధనలు బూడిదలో పన్నీరు..
- నివాస ప్లాన్లతో కమర్షియల్ దందా.. 'హైడ్రా' కన్ను పడాల్సిందే!
- జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్, మున్సిపల్ శాఖ మాత్యులు సీ.ఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి...





హైదరాబాద్, ఫిబ్రవరి 5 (భారత శక్తి) : సామాన్యులకు భవన అనుమతులు సులభతరం చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'బిల్డ్ నౌ' వ్యవస్థ.. అవినీతి అధికారులకు కల్పవృక్షంగా మారింది. పారదర్శకత పేరుతో తీసుకొచ్చిన ఈ ఆన్‌లైన్ విధానంలోని లొసుగులను ఆసరాగా చేసుకుని టౌన్ ప్లానింగ్ అధికారులు కాసుల వేటలో పడ్డారు. క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండానే ఏసీ గదుల్లో కూర్చుని అక్రమ నిర్మాణాలకు పచ్చజెండా ఊపుతున్నారు. ఎల్.బి. నగర్ జోన్, హుడా కాలనీలో వెలుస్తున్న ఓ భారీ అక్రమ కట్టడమే దీనికి నిదర్శనం.

*** బిల్డ్ నౌ వెబ్‌సైట్ పారదర్శకత మాయ.. అవినీతి తారాస్థాయి!**

'బిల్డ్ నౌ' వెబ్‌సైట్‌లో సెల్ఫ్ సర్టిఫికేషన్ విధానాన్ని జిహెచ్ఎంసి సర్కిల్ 12 సరూర్నగర్ సర్కిల్ అధికారులు బిల్డర్లతో కుమ్మక్కై అధికార దుర్వినియోగం చేస్తున్నారు. హుడా కాలనీ ప్లాట్ నం. 39లో (ఫైల్ నంబర్లు: 010392/GHMC/03322/IABP/C5/2025 మరియు 010390/GHMC/03321/IABP/C5/2025) రెండు వేర్వేరు అనుమతులు పొంది, వాటిని అక్రమంగా విలీనం (Clubbing) చేసి భారీ వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఆన్‌లైన్‌లో డేటా ఉన్నా, క్షేత్రస్థాయిలో ఉల్లంఘనలను గుర్తించడంలో అధికారులు కావాలనే తాత్సారం చేయడం వెనుక 'నోట్ల కట్టల' మత్తు ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిహెచ్ఎంసి సర్కిల్ 12 సరూర్నగర్ సంబంధిత అధికారులు టిపిఎస్ అర్చన ఏ.సీ.పి మధు డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ ఎల్బీనగర్ జోన్ స్థాయి అధికారి సి.పి శ్రీనివాస్ యాదవ్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులకు వ్రాతపూర్వక ఫిర్యాదులు చేసి నెలలు గడిచినా చర్యలు తీసుకోకపోవడం వెనుక అంతర్యం ఏమిటో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి కర్ణన్ దృష్టి సారించి సంబంధిత అధికారులపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక జనం డిమాండ్ చేస్తున్నారు.

*** ఫైర్ సేఫ్టీకి పాతర.. మృత్యుకూపాలుగా సెల్లార్లు**

అగ్నిమాపక నిబంధనల ప్రకారం కమర్షియల్ భవనాలకు కఠినమైన రూల్స్ ఉంటాయి. కానీ ఇక్కడ నివాస భవనంగా అనుమతి పొంది, రహస్యంగా సెల్లార్ తవ్వేసి, కమర్షియల్ హంగులతో నిర్మాణం సాగిస్తున్నారు. కనీసం






సెట్‌బ్యాక్‌లు (Setbacks) వదలకుండా నిర్మిస్తున్న ఈ భవనంలో రేపు ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే ఫైర్ ఇంజన్ కూడా వెళ్లే దారి లేదు. పార్కింగ్ స్థలంలో వ్యాపారాలు చేసేందుకు ప్లాన్ మార్చేయడం బిల్డర్ తెగింపునకు పరాకాష్ట.

*** 'హైడ్రా' రాడార్‌లోకి అక్రమ నిర్మాణాలు!**

నగరంలో అక్రమ నిర్మాణాల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'హైడ్రా' (HYDRAA) దృష్టి ఇప్పుడు ఇలాంటి ఉల్లంఘనలపై పడాల్సిన అవసరం ఉంది. కేవలం చెరువుల ఆక్రమణలే కాకుండా, నివాస ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న వాణిజ్య సముదాయాలను కూడా హైడ్రా సీరియస్‌గా తీసుకుంటోంది. హుడా కాలనీలో జరుగుతున్న ఈ అక్రమ విలీనంపై స్థానికులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. చట్టాన్ని అతిక్రమించి నిర్మించిన ప్రతి ఇటుకను హైడ్రా కూల్చివేయక తప్పదని హెచ్చరిస్తున్నారు.

*** అవినీతికి పాల్పడిన వారి పై క్రిమినల్ కేసులు.. లైసెన్సుల రద్దు**

తప్పుడు పత్రాలతో 'బిల్డ్ నౌ' ద్వారా అనుమతులు పొందిన బిల్డర్‌పై ఐపీసీ 420 కింద చీటింగ్ కేసు నమోదు చేయాలని డిమాండ్లు వస్తున్నాయి. వీరికి సహకరించిన ఆర్కిటెక్ట్, లైసెన్స్డ్ టెక్నికల్ పర్సన్ల లైసెన్సులను తక్షణమే బ్లాక్ లిస్టులో పెట్టాలి. లంచాలకు ఆశపడి విధి నిర్వహణలో విఫలమైన టౌన్ ప్లానింగ్ అధికారులపై ఏసీబీ (ACB) విచారణ జరిపి, అక్రమ ఆస్తులను అటాచ్ చేయాలని బాధితులు కోరుతున్నారు.

*** ప్రభుత్వం మేల్కొనాలి!**

సాంకేతికతను వాడుకుని అక్రమాలకు పాల్పడుతున్న ఇలాంటి 'వైట్ కాలర్' నేరగాళ్లపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. ఎల్.బి. నగర్ లో వెలుస్తున్న ఈ అక్రమ కట్టడాన్ని తక్షణమే సీల్ చేసి, స్టాప్‌వర్క్ నోటీసులు అమలు చేయాలి. లేనిపక్షంలో ఉన్నతాధికారుల చిత్తశుద్ధిపై సామాన్య ప్రజల్లో అనుమానాలు పెరగడం ఖాయం.

ఈ అక్రమ నిర్మాణంపై హైడ్రా మరియు ఏసీబీ అధికారులు ఉక్కుపాదం మోపాలని, నిబంధనలు అతిక్రమించిన భవనాన్ని నేలమట్టం చేయాలని స్థానికులు పోరాటానికి సిద్ధమవుతున్నారు

## కామారెడ్డిలో కాంగ్రెస్‌కు భారీ మద్దతు



కామారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 05 (భారత శక్తి ప్రతినిధి) : కామారెడ్డి మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు పెరుగుతోంది. పట్టణంలోని 42, 43 వార్డుల నుండి ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. అభివృద్ధిని చూసే ఈ నిర్ణయం వార్డు ప్రజలు షబ్బీర్ అలీ సమక్షంలో గెలుపు ప్రతిజ్ఞ చేశారు. షబ్బీర్ ఆలీ కామారెడ్డి నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి పనులను చూసి ఆకర్షితులమయ్యామని ఈ సందర్భంగా స్థానిక ప్రజలు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సేవలు, షబ్బీర్ అలీ నాయకత్వంపై మాకు నమ్మకం ఉంది. అందుకే మా 42, 43 వార్డులలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను స్వచ్ఛందంగా భారీ మెజారిటీతో గెలిపించుకుంటాం అని వారు నినదించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలను ఉద్దేశించి మహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ ప్రజలు చూపిస్తున్న ప్రేమాభిమానాలకు కృతజ్ఞతలు తెలిపారు. నేరుగా కలవండి: "వార్డులలో ఎలాంటి సమస్యలు ఉన్నా, ఏవైనా ఇబ్బందులు ఎదురైనా సంకోచించకుండా నేరుగా నా దృష్టికి తీసుకురండి. మీ సమస్యలను పరిష్కరించడానికి నేను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాను. సంక్షేమానికి పెద్దపీట; కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధికి ఓటు వేయండి పట్టణాన్ని మరింత సుందరంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలంటే కాంగ్రెస్ అభ్యర్థుల విజయం అవసరమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో 42 వ వార్డు అభ్యర్థి కుబ్రా ఆతీక్.43 వార్డ్ అభ్యర్థి సోమన్న రాజు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున మహిళలు, యువత పాల్గొన్నారు.

## ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్ జితేష్ వి. పాటిల్




భద్రాద్రి జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 05 (భారతశక్తి): కొత్తగూడెం ఆర్డీవో కార్యాలయం ప్రాంగణంలో ఈవీఎం గోడౌన్ ను గురువారం కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈవీఎం భద్రతకు సంబంధించి ప్రతినెల తనిఖీ చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా గురువారం సందర్శించడం జరిగిందని తెలిపారు. ఈ పరిశీలనలో భాగంగా సీసీ కెమెరా గదిలో కెమెరాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఆయన గోడౌన్ పరిసర ప్రాంతంలో పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవరిని లోపలికి అనుమతించరాదని అధికారులకు సెక్యూరిటీ గార్డ్ కు తెలిపారు. అనంతరం తనిఖీ రిజిస్టర్లు సంతకం చేశారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఎన్నికల సూపరిండెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల సిబ్బంది నవీన్, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి ప్రసాదం మహాప్రసాదం




మణుగూరు, ఫిబ్రవరి 05 (భారతశక్తి) : అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన హరిహరసుతుడు అయ్యప్పస్వామి వారి జన్మ నక్షత్రం ఉత్తరా నక్షత్రం పర్వదినం సందర్భంగా గురుస్వాముల ఆధ్వర్యంలో ప్రతి నెల వివిధ పీఠాల్లో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురంలో గల శ్రీ వైకుంఠ సీతారామచంద్రస్వామి వారి దేవాలయం ఆవరణలో అయ్యప్ప స్వామి పీఠం ఎదురుగా మండలంలోని పీఠం గురుస్వాముల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా అశ్వాపురం మండలంలోని అరిఫా అండ్ రోష్ని వృథాశ్రమంలో కూడా అయ్యప్పస్వామి పీఠం గురుస్వాముల ఆధ్వర్యంలో 30 మంది వృద్ధులకు రుచికరమైన వంటకాలతో అన్నదానం చేశారు. మణుగూరు మండలంలోని అయ్యప్పస్వామి పీఠం గురుస్వాముల సంకల్ప బలం సహకారంతో ప్రతి నెలలో వచ్చే అయ్యప్ప స్వామి వారి జన్మ నక్షత్రం ఉత్తరా నక్షత్రం రోజున వివిధ పీఠాల్లో, వృథాశ్రమాల్లో మహా అన్నదానం చేయడం జరుగుతుందని గురుస్వాములు తెలియజేశారు. అన్నదాన కార్యక్రమాల్లో ముందుగా అర్చకులు గణపతి మంత్రోచ్చరణతో అయ్యప్ప స్వామి వారి విగ్రహానికి ప్రతిష్ఠించి పుష్పాలతో అభిషేకం చేసి పూల మాలలు వేసి కన్నుల పండువగా అలంకార ప్రియుడిని అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వడ్డించిన వంటకాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అయ్యప్ప మాల ధరించినప్పుడు వారికి ఎదురైన అనుభవాలు, తెలియకుండా అయ్యప్ప స్వామి రూపంలో జరిగిన మహిమలు, స్వామి వారి తత్వమును గురుస్వాములు బోధించారు. అయ్యప్పస్వామి వారి మహా ప్రసాదం స్వీకరించేందుకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి విజయవంతం చేశారు.



సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీవీ నగర్ రామాలయం వద్ద సీఐ సైదిరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ గంగాధర్ రెడ్డి, పోలీస్ సిబ్బంది కలిసి వాహనాల తనిఖీలు నిర్వహించారు. సరి అయిన వాహన పత్రాలు లేని వారి వాహనాలకు జరిమానాలు విధించారు.

ఎల్బీనగర్, ఫిబ్రవరి 05 (భారత శక్తి):

# వైసీపీ హయాంలో చేసిన పనులకు బిల్లులు మేమే చెల్లిస్తాం

అమరావతి, ఫిబ్రవరి 05 (భారతశక్తి): రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించే బాధ్యతను నీటి వినియోగదారుల సంఘాలు తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. సాగునీటి సంఘాలు చేపట్టే పనులకు జీఎస్టీ లేకుండా చూస్తామని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు సైతం బిల్లులు చెల్లించే బాధ్యత తమదేనని ఆయన కీలక హామీ ఇచ్చారు. గురువారం అమరావతిలో నీటి వినియోగదారుల సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులతో నిర్వహించిన ముఖాముఖి సమావేశంలో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "నీటి భద్రత అందరికీ అవసరం కానీ, దాని సంరక్షణపై చాలా మందికి శ్రద్ధ లేదు. పరుగెత్తే నీటిని నిలపాలి, నడిచే నీటిని జలాశయంగా మార్చాలి. అప్పుడే భూగర్భ జలాల మట్టం పెరుగుతుంది" అని సూచించారు. రాష్ట్రంలో ఉన్న 40 జీవనదుల నీటిని సమర్థవంతంగా వినియోగించుకుంటే కరవు అనే మాటే వినిపించదని ఆయన స్పష్టం చేశారు. ఒకప్పుడు రైతు ఆత్మహత్యలకు కేంద్రంగా ఉన్న రాష్ట్రాన్ని, ఇప్పుడు రైతులకు అనుకూలమైన రాష్ట్రంగా మారుస్తున్నామని తెలిపారు. సాగునీటి సంఘాలకు నామినేషన్ పద్ధతిలో పనులు అప్పగిస్తున్నందున, చివరి ఆయకట్టు వరకు నీరు చేరేలా చూడాల్సిన బాధ్యత వాటిపైనే ఉందని సీఎం దిశానిర్దేశం చేశారు. నీటి పన్నులు వసూలు చేసుకుని, ఆ నిధులతో కాలువల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టవచ్చని సూచించారు. రాష్ట్రంలో 6,700 నీటి వినియోగదారుల సంఘాలు, 58 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించిన విషయాన్ని గుర్తు చేశారు. ఖరీఫ్, రబీ సీజన్లకు సరైన సమయంలో నీరందేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. వరితో పాటు ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించడం ద్వారా వారి ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యత ఇస్తూ, భూగర్భ జలాల పెంపు, కాలువలు, ప్రాజెక్టుల నిర్వహణలో సంఘాలు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## బొగ్గు గనిలో పేలుడు...
# 16 మంది మృత్యువాత

మేఘాలయ, ఫిబ్రవరి 05 (భారతశక్తి): మేఘాలయలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తాష్ఖె ప్రాంతంలోని ఓ బొగ్గు గనిలో గురువారం పేలుడు సంభవించడంతో, 16 మంది కార్మికులు మరణించారు. ఈ దుర్ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. వార్తా సంస్థల కథనాల ప్రకారం, గని లోపల ఈ పేలుడు జరగడంతో కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా అసోం రాష్ట్రానికి చెందిన వలస కార్మికులుగా అధికారులు అనుమానిస్తున్నారు. వీరిలో ఒకరిని కటిగొరా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మిగతా వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ దుర్ఘటన గురించి తెలియగానే మేఘాలయ పోలీసులు, సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గనిలోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. మేఘాలయలో తరచూ జరుగుతున్న చట్టవిరుద్ధమైన 'ర్యాట్ హోల్' మైనింగ్ వల్లే ఇలాంటి ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభమైంది. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో భారత్ 'వాయు' గర్జన

ఢిల్లీ, ఫిబ్రవరి 05 (భారతశక్తి): భారత వాయుసేన (IAF) తన సైనిక శక్తిని, వ్యూహాత్మక సంసిద్ధతను ప్రదర్శించేందుకు సిద్ధమైంది. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో, పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలో ఫిబ్రవరి 27న 'వాయు శక్తి 2026' పేరిట భారీ వైమానిక విన్యాసాలు నిర్వహించనుంది. గతంలో సరిహద్దు దాటి ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిన 'ఆపరేషన్ సిందూర్' తరహాలో ఈ విన్యాసాలను రూపొందించారు. ఈ ప్రదర్శన ద్వారా భారత వాయు శక్తి సామర్థ్యాలు మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించనున్నాయి. ఈ విన్యాసాల్లో వందకు పైగా విమానాలు పాల్గొననున్నాయని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. రఫేల్, సుఖోయ్30, తేజస్, మిగ్ 29, జాగ్వార్, మిరాజ్2000, హాక్ వంటి యుద్ధ విమానాలు లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించనున్నాయి. వీటితో పాటు స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ప్రచండ్ అటాక్ హెలికాప్టర్ కూడా రాకెట్లను ప్రయోగిస్తుంది. వాయుసేన నుంచి వైదొలిగిన మిగ్21 విమానం ఈ తరహా విన్యాసాల్లో కనిపించకపోవడం ఇదే తొలిసారి. ఒక కృత్రిమ యుద్ధ వాతావరణాన్ని సృష్టించి, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (IACCS) ద్వారా ఈ మొత్తం విన్యాసాలను పర్యవేక్షించనున్నారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ విమానాలు, క్షిపణుల గమనాన్ని గుర్తించింది ఈ వ్యవస్థే. ఈ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా సి295 రవాణా విమానం మొదటిసారిగా రాత్రిపూట అసాల్ట్ ల్యాండింగ్ డ్రిల్ నిర్వహించనుంది. సి130జె సూపర్ హెర్క్యులస్ విమానం చిన్న రన్‌వేపై ల్యాండ్ అయి, గరుడ్ కమాండోలను దించి, వెంటనే టేకాఫ్ అవుతుంది. ఈ విన్యాసాల గురించి పాకిస్థాన్‌కు ముందస్తు సమాచారం అందించినట్లు, 'నోటీస్ టు ఎయిర్‌మెన్' (NOTAM) జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పలువురు వీఐపీలతో పాటు, ఢిల్లీలోని సుమారు 40 మిత్రదేశాల రాయబార కార్యాలయాల అధికారులు కూడా హాజరుకానున్నారు.

## నిరసనల మధ్య...
# రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసంగం

ఢిల్లీ, ఫిబ్రవరి 05 (భారతశక్తి): పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. గురువారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇస్తుండగా, విపక్ష సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు అడ్డంకి కలిగించి, చివరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సభ నుంచి వాకౌట్ చేశారు. మాజీ సైన్యాధిపతి జనరల్ ఎం.ఎం. నరవణే తన ఆత్మకథలో రాసిన కొన్ని కీలక అంశాలపై లోక్‌సభలో చర్చకు అనుమతించకపోవడమే ఈ గందరగోళానికి ప్రధాన కారణం. 2020లో చైనాతో సరిహద్దు ఘర్షణల సమయంలో రాజకీయ నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందలేదని నరవణే పేర్కొన్నారని, ఆ భాగాలను చదివి వినిపించేందుకు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీకి అవకాశం ఇవ్వలేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇదే అంశంపై గత మూడు రోజులుగా లోక్‌సభ దద్దరిల్లుతోంది. బుధవారం లోక్‌సభలో మహిళా ఎంపీలు ప్లకార్డులతో నిరసన తెలపడంతో సభ వాయిదా పడి, ప్రధాని ప్రసంగం నిలిచిపోయింది. ఇవాళ రాజ్యసభలోనూ విపక్షాలు భగ్గుమన్నాయి. రాజ్యసభలో విపక్షాల నినాదాలు, అల్లరి మధ్యే ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించారు. 'వికసిత భారత్' నిర్మాణంలో దేశం సరైన దిశలో వేగంగా పయనిస్తోందని అన్నారు. "గత కొన్ని సంవత్సరాలు దేశ వేగవంతమైన అభివృద్ధికి సాక్ష్యంగా నిలిచాయి. ప్రతి రంగంలోనూ ఇది మార్పుల యుగం" అని పేర్కొన్నారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు వృద్ధాప్యంలోకి వెళుతుంటే, యువశక్తితో ఉరకలేస్తున్న భారత్ ప్రపంచానికి కొత్త ఆశను అందిస్తోందని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ, ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా సాగుతోందని ధీమా వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠ పెరిగిందని, ఇటీవలే 9 కీలక వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. గత కొన్నేళ్లుగా చేపట్టిన సంస్కరణల కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పుడు భారత్‌తో వ్యాపారం చేయడానికి ఎంతో ఆసక్తిగా ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రధాని మాట్లాడుతున్నంత సేపు విపక్ష సభ్యులు 'విపక్ష నేతను మాట్లాడనివ్వండి', 'నియంతృత్వం నశించాలి' వంటి నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ, విపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై సరదాగా వ్యాఖ్యలు చేశారు. "ఖర్గే జీ వయసు, సీనియారిటీని దృష్టిలో ఉంచుకుని ఆయన కూర్చునే నినాదాలు చేసేందుకు అనుమతి ఇవ్వాలి" అని ప్యానెల్ స్పీకర్ ను కోరుతున్నట్లు చమత్కరించారు. ఈ క్రమంలో విపక్షాలు సభ నుంచి నిష్క్రమించాయి. పార్లమెంటరీ సంప్రదాయాలను ప్రభుత్వం కాలరాస్తోందని విపక్షాలు ఆరోపిస్తుండగా, అభివృద్ధి అజెండానే తమకు ముఖ్యమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

# కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను అరెస్టు చేయాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 05 (భారతశక్తి): కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో కేసీఆర్, హరీశ్ రావును, ఫార్ములా ఈకార్ రేసింగ్‌లో కేటీఆర్‌ను అరెస్టు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధమని విమర్శించారు. బీఆర్ఎస్ అగ్ర నాయకులను అరెస్టు చేసిన తర్వాతనే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ నేతలు ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని సోనియా గాంధీ కరీంనగర్ గడ్డ నుంచే హామీ ఇచ్చి నెరవేర్చారని అన్నారు. ఏపీలో అధికారం కోల్పోయినా మాట తప్పలేదని అన్నారు. ఏపీ పెట్టుబడిదారులు అడ్డుపడినా ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినప్పటికీ ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టారని, కానీ ప్రజల ఆకాంక్షలను వారు నెరవేర్చలేకపోయారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే తమపై కొంతమంది విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని ఆ కుటుంబం దాడి చేస్తోందని మండిపడ్డారు. కేసీఆర్ నెల నెలా వేతనం తీసుకుంటున్నారు కానీ సభకు మాత్రం రావడం లేదని, ఒక్కరోజు కూడా అసెంబ్లీకి రాని ఆయనకు వేతనం కట్ చేయవద్దా అని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను బీఆర్ఎస్ గెలిపించిందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల కోసం బీజేపీ జాతీయ అధ్యక్షుడిని తీసుకువచ్చిందని, కానీ కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను అరెస్టు చేశాకే వారు ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. రెండేళ్లు మీరేం చేశారని బీజేపీ ప్రశ్నిస్తోందని, కానీ పదేళ్లు వారేం చేశారో చెప్పడం లేదని చురక అంటించారు. మోదీ, అమిత్ షా ఎవరిని తీసుకొచ్చినా మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క సీటు బీజేపీ గెలవదని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. అలాంటప్పుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు తెలంగాణకు ఎందుకోసం వచ్చినట్లని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో సీబీఐ విచారణ చేయించాలని అసెంబ్లీ తీర్మానం చేసి పంపిస్తే కేంద్రం స్పందించలేదని మండిపడ్డారు. ఫార్ములా ఈ రేసు కేసులో చర్యలు తీసుకోవాలని కోరినా స్పందించడం లేదని ఆరోపించారు. మెట్రో రైలు మంజూరు చేయలేదని, మూసీ ప్రక్షాళనకు నిధులు ఇవ్వలేదని అన్నారు. కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎంలా మారిందని మోదీ, అమిత్ షా కూడా అన్నారని గుర్తు చేశారు. తాము అధికారంలోకి వచ్చాక ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని, ఎంతో అభివృద్ధి చేశామని అన్నారు. వెయ్యి బస్సులకు ఆడబిడ్డలను యజమానులుగా చేశామని, రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడించారు. రైతులకు రుణమాఫీ చేశామని అన్నారు. కానీ బీఆర్ఎస్ హయాంలో ఆడబిడ్డల చీరల్లో కూడా కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు.

# ముంబయిలో లిఫ్ట్‌లో గ్యాస్ బెలూన్లు పేలి మంటలు

ముంబయి, ఫిబ్రవరి 05 (భారతశక్తి): ముంబయిలో గ్యాస్‌తో నింపిన బెలూన్లు ఒక్కసారిగా పేలి లిఫ్ట్‌లో మంటలు చెలరేగిన ఘటన కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముంబయి గోరెగావ్ (వెస్ట్) ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో బెలూన్లు డెలివరీ చేసేందుకు రాజ్‌కుమార్ మహతో అనే వ్యక్తి లిఫ్ట్‌లోకి ఎక్కాడు. అదే సమయంలో వైద్య విద్యార్థిని హిమానీతో పాటు మరో యువకుడు కూడా లిఫ్ట్‌లోకి వచ్చారు. లిఫ్ట్ కదలకముందే బెలూన్లు ఒక్కసారిగా పేలిపోవడంతో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో భయంతో ముగ్గురూ వెంటనే లిఫ్ట్ నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ ఘటనలో రాజ్‌కుమార్ మహతో, హిమానీకి గాయాలయ్యాయి. అపార్ట్‌మెంట్‌లో నిర్వహించనున్న ఓ వేడుక కోసం బెలూన్లను తీసుకొస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. బెలూన్ల దుకాణం యజమాని టీకే జైశ్వాల్ సూచనల మేరకు బెలూన్ల డెలివరీ జరుగుతుండటంతో.. ఆయనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

# తెలంగాణ డీజీపీ నియామకంపై సుప్రీంకోర్టు సీరియస్..

హైదరాబాద్, ఫిబ్రవరి 05 (భారతశక్తి): తెలంగాణ శాశ్వత డీజీపీ నియామక ప్రక్రియపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర డీజీపీ నియామకానికి సంబంధించి నాలుగు వారాల్లోగా తగిన సిఫార్సులు చేయాలని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ను ఆదేశించింది. ఈ మేరకు జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం విచారణ జరిపి స్పష్టమైన గడువు విధించింది.

**ఇన్‌చార్జ్ పాలనపై ఆగ్రహం**

రాష్ట్రంలో రెగ్యులర్ డీజీపీని నియమించకుండా, కేవలం 'యాక్టింగ్' లేదా 'ఇన్‌చార్జ్' డీజీపీలతో కాలం వెళ్లదీయడంపై సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసింది. తెలంగాణతో పాటు అనేక రాష్ట్రాలు సకాలంలో డీజీపీ నియామకానికి సంబంధించిన ప్రతిపాదనలు పంపడంలో విపరీతమైన జాప్యం చేస్తున్నాయని కోర్టు పేర్కొంది.

**మెరిట్ ఉన్న ఆఫీసర్లకు అన్యాయం**

"రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ఈ జాప్యం వల్ల నిజాయితీ, సమర్థత కలిగిన ఐపీఎస్ అధికారులకు తీరని అన్యాయం జరుగుతోంది. అర్హత ఉండి కూడా పదవి దక్కకుండా పోతోంది," అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అధికారుల యోగ్యతను మాత్రమే ప్రామాణికంగా తీసుకుని యూపీఎస్సీ సిఫార్సులు చేయాలని సూచించింది.

**రాష్ట్రాలకు సుప్రీం వార్నింగ్**


డీజీపీ నియామకాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని సుప్రీంకోర్టు హెచ్చరించింది. రాష్ట్రాలు ప్రతిపాదనలు ఆలస్యం చేస్తే యూపీఎస్సీ చూస్తూ ఊరుకోకూడదని, వెంటనే ఆయా రాష్ట్రాలకు లేఖలు రాయాలని ఆదేశించింది. లేఖలు రాసినా రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోతే, కమిషన్ నేరుగా సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని వెసులుబాటు కల్పించింది. దీంతో తెలంగాణ డీజీపీ నియామక ప్రక్రియ రాబోయే నెల రోజుల్లో వేగవంతం అయ్యే అవకాశం ఉంది.

# హన్మకొండలో మేడారం హుండీల లెక్కింపు

వరంగల్, ఫిబ్రవరి 05 (భారతశక్తి): ఆసియా అతిపెద్ద గిరిజన జాతర మేడారం హుండీల లెక్కింపు ప్రారంభమైంది. హుండీల లెక్కింపునకు పది రోజుల సమయం పడుతుందని భావిస్తున్నారు. రెండేళ్లకోసారి వచ్చే ఈ మహా జాతర గత నెల 28 నుంచి 31 వరకు జరిగింది. సమ్మక్క, సారలమ్మలను కోట్లాది మంది భక్తులు దర్శించుకుంటారు. జాతరకు నెల రోజుల ముందు, జాతర అనంతరం మరికొన్నిరోజులు మేడారంను భక్తులు సందర్శిస్తారు. ఈ మహా జాతర హుండీలను హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపానికి తీసుకువచ్చారు. ఈరోజు మంత్రి కొండా సురేఖ కొబ్బరికాయ కొట్టి లెక్కింపును ప్రారంభించారు. మేడారం జాతరకు తరలి వచ్చిన భక్తులు అమ్మవార్లకు కానుకలు సమర్పించుకున్నారు. క్రితంసారి మేడారం జాతరకు రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది.

# రాజకీయంగా ఎదుర్కోలేకే కులాల ప్రస్తావన.. సీఎం రేవంత్‌పై కవిత ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 05 (భారతశక్తి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై, ఇటీవల చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సీఎం హోదాలో ఉన్న వ్యక్తి ఒక సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని మాట్లాడటం సరికాదని హితవు పలికారు. అలాగే జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వ్యవహారంలో స్పీకర్ నిర్ణయాన్ని ఆమె తప్పుబట్టారు.



**రాజ్యాంగం మీద ప్రమాణం చేసి**

"రాజకీయంగా మమ్మల్ని ఎదుర్కొనే దమ్ములేకనే రేవంత్ రెడ్డి వెలమ జాతిని టార్గెట్ చేస్తూ విషం చిమ్ముతున్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు కులమత బేధాలు లేకుండా అందరినీ గౌరవిస్తానని రాజ్యాంగం సాక్షిగా మాటిచ్చారు. కానీ ఇప్పుడు అవన్నీ మరిచిపోయి, మర్యాదలు అతిక్రమించి నోటికి వచ్చినట్లు మాట్లాడటం పద్ధతి కాదు," అని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం తన వైఖరిని వెంటనే మార్చుకోవాలని ఆమె సూచించారు.

*** గాంధీ భవన్ మెట్లు ఎక్కిన వ్యక్తికి క్లీన్ చిట్టా?**

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు ఫిరాయింపుల విషయంలో స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడంపై కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఎమ్మెల్యే సంజయ్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి మారిన విషయం ప్రజలందరికీ తెలుసు. స్వయంగా ముఖ్యమంత్రి సమక్షంలోనే ఆయన పార్టీ మారారు. గాంధీ భవన్‌లో అధికారిక మీటింగ్‌లకు హాజరయ్యారు. అంతేకాదు, జగిత్యాలలో 30 మంది మున్సిపల్ అభ్యర్థులకు కాంగ్రెస్ బీఫామ్ (B Forms)లు కూడా పంపిణీ చేశారు. ఇన్ని సాక్ష్యాలు ఉండగా ఆయనకు క్లీన్ చిట్ ఎలా ఇస్తారు?" అని ఆమె ప్రశ్నించారు.

*** నైతికత ఉంటే రాజీనామా చేయాలి**

రాజ్యాంగబద్ధమైన హక్కులను ఒక్కొక్కటిగా తుంగలో తొక్కడం భవిష్యత్ తరాలకు మంచిది కాదని కవిత హెచ్చరించారు. "సంజయ్‌కి ఏమాత్రం నీతి, నిజాయితీ ఉన్నా వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. స్పీకర్ కూడా ఈ విషయంలో తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా," అని కవిత స్పష్టం చేశారు.

○ హయత్ నగర్ 'బాతుల చెరువు' శిఖం భూముల్లో 10ల సంఖ్యలో అక్రమ నిర్మాణాల జోరు..

○ నివాస అనుమతులతో కమర్షియల్ దందా.. అధికారుల అండదండలతోనే 'అవినీతి' అడుగులు?

○ బిల్డ్ నౌ వెబ్సైట్లో పారదర్శకత లేకపోవడంతో పేట్రేగిపోతున్న అధికారులు..

# నిబంధనలు 'తుంగలో'..
# అక్రమాలు 'చెరువులో'!










**హయత్ నగర్, ఫిబ్రవరి 5 (భారత శక్తి) :** చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నది పాత మాట.. ఇక్కడ అక్రమార్కులు తమ పని తాము చేసుకుపోతుంటే, అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. హయత్ నగర్ డివిజన్‌లోని బాతుల చెరువు కట్ట కింద జరుగుతున్న వ్యవహారం మున్సిపల్ నిబంధనలకు పాతర వేస్తోంది. చెరువు శిఖం (FTL), బఫర్ జోన్లను మింగేస్తూ వెలుస్తున్న అక్రమ కట్టడాలు జీహెచ్ఎంసీ ఆదాయానికి భారీ గండి కొడుతుండగా, టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై స్థానికులు నిప్పులు చెరుగుతున్నారు.

### అనుమతి ఒకటి.. నిర్మాణం మరొకటి!

హయత్ నగర్ జి స్కూల్ ప్రక్కనుండి మునగనూర్ ప్రధాన రహదారిని ఆనుకుని సుమారు కిలోమీటర్ మేర వెలుస్తున్న భవనాలన్నీ అక్రమాల పుట్టలేనని విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఫైల్ నంబర్: 032902/GHMC/08157/IABP/C3/2025 పరిధిలోని ప్లాట్ నంబర్ 62/A (సర్వే నంబర్లు: 306309)లో నివాస గృహం (Residential) కోసం అనుమతి పొంది, నిబంధనలకు విరుద్ధంగా భారీ కమర్షియల్ హోటల్ నిర్మిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం 137.12 చదరపు మీటర్ల స్థలంలో వాణిజ్య సముదాయాలు నిర్మించడం వెనుక అధికారుల 'మామూళ్ల' పర్వం ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి.

### దళారీ వ్యవస్థదే పైచేయి..

బాతుల చెరువు కట్ట కింద ఉన్న స్థలాల యజమానులను భయపెట్టి, "ఇది ఎఫ్.టి.ఎల్ ప్రాంతం.. నేను చూసుకుంటాను" అంటూ రంగంలోకి దిగుతున్న ఓ దళారీ, లీజు అగ్రిమెంట్ల పేరుతో అక్రమ నిర్మాణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాడు. మున్సిపల్ అధికారులను మేనేజ్ చేస్తూ, అడిగిన వారిని బెదిరిస్తూ ఈ 'అవినీతి సామ్రాజ్యాన్ని' విస్తరిస్తున్నాడని సమాచారం. సెల్లార్లలో నిబంధనలకు విరుద్ధంగా స్టాక్ నింపడం వల్ల భవిష్యత్తులో అగ్నిప్రమాదాలు జరిగితే ప్రాణనష్టానికి బాధ్యులెవరని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

### నోటీసులతో అధికారుల కాలయాపన:

అక్రమ కట్టడాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందితే, క్షేత్రస్థాయి అధికారులు కేవలం 'నోటీసులు ఇచ్చాం' అని నివేదికలు పంపి చేతులు దులుపుకుంటున్నారు. టీపీఎస్ సోమేష్ కుమార్, ఏసీపీ విజయలక్ష్మి, డీసీ వంశీకృష్ణ వంటి అధికారులు ఈ అక్రమాలను ఎందుకు ప్రోత్సహిస్తున్నారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఇక్కడ ఉన్న 'లేక్ వే కాఫీ షాప్'తో పాటు అనేక వాణిజ్య సముదాయాలు ఫైర్ సేఫ్టీ నిబంధనలను బేఖాతరు చేస్తున్నా, టౌన్ ప్లానింగ్ విభాగం మౌనం వహించడం వెనుక అంతర్యమేమిటి?

### 'హైడ్రా' కన్ను పడాల్సిందే!

హైదరాబాద్‌లోని చెరువులను, ప్రభుత్వ భూములను కాపాడటమే లక్ష్యంగా పనిచేస్తున్న 'హైడ్రా' (HYDRAA) కమిషనర్ రంగనాథ్ ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

* నివాస అనుమతులతో కమర్షియల్ వ్యాపారాలు చేస్తున్న భవనాలను వెంటనే సీజ్ చేయాలి.
* అక్రమ నిర్మాణాలకు సహకరించిన హయత్ నగర్ సర్కిల్ అధికారులపై విచారణ జరిపించాలి.
* జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ లు స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలన చేయాలి.

చెరువు కట్ట కింద ఉన్న మృత్యుకూపాలను 'సుమోటో'గా తీసుకుని అధికారులు తక్షణమే చర్యలు చేపట్టకపోతే భవిష్యత్తులో భారీ ముప్పు తప్పదని హెచ్చరికలు జారీ అవుతున్నాయి.

### * బిల్డ్ నౌ'లో పారదర్శకత నిల్.. అవినీతికి అది 'అధికారుల' స్వర్గధామం!

ప్రజల చెంతకు పాలనను చేరువ చేయాల్సిన 'బిల్డ్ నౌ' వెబ్‌సైట్, ప్రస్తుతం అక్రమార్కులకు వరప్రసాదంగా మారింది. సిటిజన్ సెర్చ్‌లో కీలక సమాచారాన్ని మాయం చేస్తూ, అనుమతులు ఇచ్చే అధికారుల వివరాలను గోప్యంగా ఉంచుతూ టౌన్ ప్లానింగ్ విభాగం భారీ వసూళ్లకు తెరలేపింది. నిషేధిత భూములను సైతం కాసుల కక్కుర్తితో అనుమతుల జాబితాలోకి చేర్చి, వ్యవస్థలో జవాబుదారీతనాన్ని కాలరాస్తున్నారు. పారదర్శకత లోపించడమే పెట్టుబడిగా సామాన్యుల కళ్ళుగప్పి అవినీతి చిట్టాను వెతకలేనంతగా వెబ్‌సైట్‌ను రూపొందించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నత స్థాయి అధికారులే దొంగలకు తాళం చెవి ఇచ్చినట్లు వ్యవహరిస్తూ, అక్రమ నిర్మాణాలకు పచ్చజెండా ఊపుతూ వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నారు.



## గౌడ సర్పంచులకు ఘన సన్మానం..

* **రవీంద్రభారతిలో అట్టహాసంగా కార్యక్రమం.. ముఖ్యఅతిథిగా నటుడు సుమన్**

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (భారతశక్తి) : తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన గౌడ కులస్తులైన సర్పంచులను ఉద్దేశించి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పంజాల జైహింద్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు సినీ నటుడు సుమన్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2100 మంది గౌడ సర్పంచులు ఎన్నికవ్వడం హర్షణీయమని వక్తలు కొనియాడారు.

* **రాజ్యాధికారమే లక్ష్యం కావాలి: జైహింద్ గౌడ్**

ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు పంజాల జైహింద్ గౌడ్ మాట్లాడుతూ.. "ఆర్థికంగా, రాజకీయంగా ఎదిగినప్పుడే సమాజంలో సరైన గుర్తింపు లభిస్తుందని" పేర్కొన్నారు. 375 ఏళ్ల క్రితమే బహుజన రాజ్యాధికారం కోసం పోరాడిన వీరనారి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూనే, స్వకుల బాంధవుల శ్రేయస్సు కోసం సర్పంచులు కృషి చేయాలని కోరారు.

* **గౌడ వృత్తిదారులకు బాసట**

కులవృత్తిపై ఆధారపడి జీవిస్తూ తాటి చెట్టుపై నుండి పడి ప్రమాదానికి గురైన గీత కార్మికులకు తమ సుప్రజా హాస్పిటల్ ద్వారా ఇప్పటి వరకు రూ. 2 కోట్ల వ్యయంతో ఉచిత వైద్యం అందించామని చైర్మన్ వెల్లడించారు. బాధితులకు అండగా ఉండటమే తమ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. ఈ సన్మాన సభలో హాజరైన ప్రముఖులు లోకేష్ గౌడ్, కాంగ్రెస్ నాయకురాలు రేఖ, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ప్రతినిధి వేముల కొండల్ గౌడ్, లింగస్వామి గౌడ్, జాజుల శ్రీనివాస్ గౌడ్, వట్టికూటి రామారావు గౌడ్, చెరుకు సుధాకర్ గౌడ్, బొంగు వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన సర్పంచులను శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు.

## న్యాయవాది హత్య చేసిన దుండగులను వెంటనే శిక్షించాలి



నాగర్ కర్నూలు జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 5 (భారత శక్తి) : చేవెళ్ల న్యాయవాద సోదరీమణి స్వప్నను హత్య చేసిన దుండగులను వెంటనే కఠినాతి కఠినంగా శిక్షించాలని నాగర్ కర్నూల్ జిల్లా బార్ ప్రెసిడెంట్ రవికాంత్ రావు డిమాండ్ చేశాడు. గురువారం జిల్లా కోర్టు ముందు న్యాయవాదులతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రజల తరపున న్యాయపోరాటం చేస్తున్న న్యాయవాదుల పైన దాడులకు పాల్పడుతున్న వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. గతంలోనూ న్యాయవాదుల పైన దాడులు చేసి క్రూరంగా హతమార్చిన వ్యక్తులు తమ పలుకుబడి ఉపయోగించుకొని చట్టాలను లెక్కచేయకుండా యదేచ్ఛగా తిరిగి సమాజంలో తిరుగుతున్నారు. హత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించే వరకు న్యాయవాదులు సమష్టిగా పోరాడతామని అన్నారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్లును వెంటనే ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కేసుపై వెంటనే ఫాస్ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి స్పెషల్ పీపీని నియమించి త్వరితగతిన మూడు నెలల వ్యవధిలోనే కేసు పూర్తి చేసి అంతకులకు శిక్ష పడే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలో ఉన్న న్యాయవాదులందరు ఇలా అడ్వకేట్ల పై దాడికి పాల్పడే వారి కేసులను వాదించకూడదని న్యాయవాదులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్, కొల్లాపూర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## జోరందుకున్న ఎల్లారెడ్డి మున్సిపల్ ఎన్నికల ప్రచారం

కామారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 05 (భారత శక్తి ప్రతినిధి) : కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మున్సిపల్ 12వ వార్డు ఎన్నికల ప్రచారం బాగా జోరందుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ 12వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎరకల దశరథంకు మద్దతుగా ప్రజలను కోరారు. గురువారం గడప గడప ప్రచారం చేస్తూ ఎమ్మెల్యే మదన్ మోహన్, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమ నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఎరకల దశరథం అభ్యర్థిని గెలిపించి సమగ్ర అభివృద్ధికి సహకరించమని ఆయన ప్రజలను కోరారు. మదన్ మోహన్ గత రెండు సంవత్సరాలలో చేపట్టిన ప్రధాన అభివృద్ధి పనులలో పూర్తి చేసిన పనులు



>> ఆధునిక సౌకర్యాలతో కొత్త బస్ స్టాండ్ నిర్మాణం పూర్తి
>> ప్రజల వినోదం, విశ్రాంతి కోసం మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి
>> మున్సిపాలిటీని అన్ని వార్డులలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేయడం

పేదలకు 300 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ
>> అమృత్ పథకం ద్వారా ఇంటింటికి తాగునీటి సరఫరా
>> మెరుగైన వైద్య సేవల కోసం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు
>> రవాణా సౌకర్యాల కోసం జాతీయ రహదారి అభివృద్ధి
>> పట్టణ శోభ, యువతకు భవిష్యత్ లక్ష్యంగా చేపట్టిన ఇతర ముఖ్య ప్రాజెక్టులు:
>> గాంధీ చౌక్ అభివృద్ధి – ఆధునిక లైటింగ్, రోడ్డు విస్తరణ
>> అంబేద్కర్ చౌరస్తా అభివృద్ధి – ఫౌంటెన్‌లు, ల్యాండ్‌స్కేపింగ్
>> ఐటీఐ విద్యార్థులకు ఉపాధి అవకాశాల కోసం అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్
>> 100 ఎకరాల్లో అర్బన్ పార్క్ అభివృద్ధి.
>> తదుపరి కార్యక్రమాలలో చేయవలసిన పనులు:
>> నూతన మున్సిపల్ భవనం నిర్మాణం
>> వ్యాపార అవకాశాల కోసం షాపింగ్ కాంప్లెక్స్

మదన్ మోహన్, "మాటలు కాదు – చేసిన అభివృద్ధి ప్రజలకు చూపించడం నా విధానం. ప్రజల సహకారంతో ఎల్లారెడ్డిని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తాను. రాబోయే కాలంలో సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయంగా కొనసాగిస్తాను," అని అన్నారు. ఈ ప్రచారంలో ఎమ్మెల్యే ప్రజలకు, ఈ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

## 9 వ వార్డ్ లో బిజెపి పార్టీ అభ్యర్థి
## మమతా రాము ఇంటింటి ప్రచారానికి జన స్పందన

వనపర్తి జిల్లా, ఫిబ్రవరి 5 (భారత శక్తి ప్రతినిధి): వనపర్తి మున్సిపాలిటీ 9వ వార్డ్ మర్రికుంటలో బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థి మమత రాము ఇంటింటి ప్రచారం నిర్వహించారు ఈ ప్రచారానికి జన స్పందన లభిస్తుందని 9వ వార్డ్ ప్రజలు కమలం గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు కార్యక్రమంలో వరాల రఘు శంకర్ అశోక్ తదితర బిజెపి పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.